### ప్రభుత్వ టీచర్లు టెట్ పాస్ కావాల్సిందే

హైదరాబాద్,టీచర్లకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. తెలంగాణలో ఇకపై సర్వీస్ టీచర్లు సైతం టెట్ క్వాలిఫై కావాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేయనుంది. దీంతో ఇకపై టీచర్లు సర్వీస్‌లో ఉండాలన్నా.. ప్రమోషన్లు పొందాలన్నా టెట్ క్వాల్గి÷ తప్పనిసరి అని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టెట్ నిబంధనలను తెలంగాణ విద్యా శాఖ సవరణ చేసింది. 2009 తర్వాత నియమితులైన 30 వేల మంది టీచర్లకు ఈ నిబంధన వర్తించనుంది. రానున్న రెండేళ్లలో సర్వీసులో ఉన్న టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సిందేనన్నది సుస్పష్టం. మరోవైపు.. టెట్ నోటిఫికేషన్‌ను గురువారం తెలంగాణ విద్యా శాఖ విడుదల చేసింది. నవంబర్ 15వ తేదీ నుంచి ఈ దరఖాస్తులను అభ్యర్థుల నుండి స్వీకరిస్తారు. నవంబర్ 29వ తేదీతో ఈ దరఖాస్తులు స్వీకరణ ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. కాగా.. ఈ ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో ప్రభుత్వం విడుదల చేసింది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :225 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 15-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థిపై 24,658 వేల ఓట్లకుపైగా మెజార్టీతో గెలుపొందారు. ఈ ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి నవీన్ యాదవ్ ప్రతి రౌండ్ లోనూ ఆధిక్యం కనబరిచారు. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యం దక్కించుకోలేకపోయారు. మొత్తం 10రౌండ్ల ఓట్ల లెక్కింపు ముగిసేసరికి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు 24,658ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పోలింగ్ ముగిశాక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వేసుకున్న అంచనా మేరకు మెజార్టీ సాధించడం గమనార్హం.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉప ఎన్నిక జూబ్లీహిల్స్ లో ఆ పార్టీ విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అంతకుముందు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలిచిన సంగతి తెలిసిందే. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ రెండు సీట్లలోనూ సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, లాస్య నందితల ఆకస్మిక మరణాలతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ రెండు స్థానాలలోనూ సెంటిమెంట్ ను అధిగమించి కాంగ్రెస్ హస్తగతం చేసుకోవడం విశేషం.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ది గెలుపే కాదు.. నైతిక విజయం మాదే..

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడీయిజం గెలిచాయని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ అన్నారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. కాంగ్రెస్‌ది గెలుపే కాదని.. నైతిక విజయం తనది, బీఆర్ఎస్‌దే అని ఆమె స్పష్టం చేశారు.జూబ్లీహిల్స్ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. పోలింగ్ రోజున ఎంతో అరాచకం సృష్టించారని తెలిపారు. ఒక మహిళపై అంతమంది రౌడీయిజం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని అన్నారు. నేను ఏం మాట్లాడినా.. కార్యకర్తలను పరామర్శించినా తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇవాళ ఉదయం నుంచే కౌంటింగ్ హాలులో ఆడవాళ్లపై కాంగ్రెస్ ర్యాగింగ్ మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. ఒక మహిళపై కాంగ్రెస్ నేతలు రౌడీ రాజకీయం చేశారని అన్నారు. ప్రజలను కాంగ్రెస్



భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికలకు మధ్య తేడా ఏంటో ప్రజలు గమనించారని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## బీజేపీ ఓటమి.. కిషన్‌రెడ్డి రియాక్షన్ ఇదే..



ఢిల్లీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమిని విశ్లేషించుకుంటామన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ప్రజా తీర్పును గౌరవిస్తామని చెప్పుకొచ్చారు. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచింది అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలి అని ఆయన ప్రశ్నించారు.కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'జూబ్లీహిల్స్‌లో మేము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదు. స్వాతంత్రం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదు. మేము ఉన్నంతలో ప్రయత్నం చేశాం. ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయి. మా పార్టీ అక్కడ బలహీనంగా ఉంది. ఓటమిని విశ్లేషించుకుంటాము. ఓల్డ్ సిటీలో కూడా ఏ పార్టీ గెలవదు. ప్రజా తీర్పును మేము శిరసా వహిస్తాం. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచింది. రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలి?. రెండు పార్టీలు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు. దీనిపై మేము ఫిర్యాదు చేస్తాం. జీహెచ్ఎంసీ ఎన్నికలపై దృష్టిపెట్టాం. జీహెచ్ఎంసీ మేయర్ పదవి గెలుచుకోవడమే మా లక్ష్యం. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనేక చోట్ల డిపాజిట్లు దక్కలేదు' అని చెప్పుకొచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి బీహార్ ప్రజలు పట్టడం కట్టారు. మేము ఊహించనంత భారీ విజయాన్ని ప్రజలు ఇచ్చారు. ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ విష ప్రచారాన్ని తిప్పికొట్టారు. దేశమంతా ఎస్ఐఆర్ జరగాలి. జూబ్లీహిల్స్‌లో ఓటర్ జాబితా తప్పులు తడకగా ఉంది. కాంగ్రెస్ పార్టీ పని అయిపోయింది. ప్రజల దృష్టిలో రాహుల్ గాంధీ నవ్వుల పాలయ్యారు అని ఎద్దేవా చేశారు.

## టార్గెట్ కిల్లింగ్ కాదు.. భారీ ప్రాణ నష్టమే లక్ష్యంగా ప్లానింగ్

న్యూఢిల్లీ,ఇస్లామిక్ స్టేట్ ఖురాసన్ ప్రావెన్సీ ఉగ్రవాదులు పలువురిని అహ్మదాబాద్ ఏటీఎస్ కస్టడీలో తీసుకోవటం తెలిసిందే. వీరిలో హైదరాబాద్ రాజేంద్రనగర్ కు చెందిన వైద్యుడు (మొయినుద్దీన్ సయ్యద్) ఒకరు. తాజాగా వీరి విచారణలో వెల్లడించిన విషయాలు విస్తుపోయేలా చేసింది. అత్యంత ప్రమాదకరమైన విషాన్ని ఎలా తయారు చేశారు? దాన్ని ఎక్కడ.. ఎలా వినియోగించాలని ప్లాన్ చేశారు? ఈ మాడ్యూల్ లో ఇంకెంత మంది ఉన్నారు? లాంటి అంశాలకు సంబంధించి కీలక అంశాల్ని గుర్తించారు. ఎంపిక చేసిన వారిని మట్టు పెట్టే టార్గెట్ కిల్లింగ్ వద్దని.. అందుకు బదులుగా ఎక్కువ ప్రాణ నష్టం కలిగేలా మాస్ కిల్లింగ్ చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు గుర్తించారు.అహ్మదాబాద్ ఏటీఎస్ చేపట్టిన తనిఖీల్లో అరెస్టు అయిన హైదరాబాద్ కు చెందిన వైద్యుడు మొయినుద్దీన్ సయ్యద్ పలు అంశాల్ని వెల్లడించారు. ఈ మాడ్యూల్ ను పాక్ - అఫ్గాన్ సరిహద్దుల్లో ఉండే అబు ఖదీజా ఆదేశాలకు తగ్గట్లు పని చేసే వారు మొయినుద్దీన్. అవసరమైన సమాచారంతో పాటు.. మాస్ కిల్లింగ్ కు అవసరమైన బాంబులు.. పిస్టళ్లు లాంటివి వినియోగించే కన్నా... విషాన్ని ప్రయోగించాలని ప్లాన్ చేశారు. ఇందుకు అవసరమైన పత్రాల్ని టెలిగ్రామ్ ద్వారా షేర్ చేసిన విషయాన్ని విచారణలో వెల్లడించినట్లుగా తెలుస్తోంది.ప్రాణాంతకమైన విషాన్ని అముదం గింజలతో ఎలా తయారు చేయాలన్న అంశాల్ని వివరించే పత్రాల్ని పీడీఎఫ్ ఫార్మాట్ లో పంపినట్లుగా గుర్తించారు. దీనికి అదనంగా ఇంటర్నెట్ లో వెతికిన మొయినుద్దీన్ దాని తయారీపై కొంత పట్టును సాధించినట్లుగా తెలుస్తోంది. ఎలాంటి రుచి లేని ఈ విషపదార్థం సైనైడ్ కంటే కూడా ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని గుర్తించారు. దీని తయారీ కోసం స్థానిక మార్కెట్ లో అముదం గింజల్ని సేకరించాడు. వాటిపై ఉండే తెల్లడి బుడిపె నుంచి ఈ విషాన్ని తయారు చేయాలని ప్లాన్ చేశారు. ఇందుకు అవసరమైన చిన్న సైజులో ఉండే పల్స్ ఎక్స్ ట్రాక్టర్ మిషిన్ ను ఖరీదు చేశాడు.షావర్మా సెంటర్ కూడా నిర్వహిస్తున్న



నేపథ్యంలో ఈ మిషన్ తన వద్ద ఉన్నట్లుగా తెలిసినా ఎవరూ అనుమానించరన్న పథకాన్ని రచించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే ఈ మిషన్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ఏటీఎస్ అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిల్లో అబు ఖదీజా పంపిన పీడీఎఫ్ ప్రింట్ లతో పాటు పల్స్ ఎక్స్ ట్రాక్టర్ మిషన్ కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. షావర్మా సెంటర్ లో రిసిన్ తయారు చేస్తున్న మొయినుద్దీన్ దీని వియోగానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోలేదని తెలుస్తోంది.అబూ ఖదీజా నుంచి క్లియరెన్స్ వచ్చే వరకు ఎలాంటి యాక్షన్ ప్లాన్ చేపట్టొద్దన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గడిచిన రెండేళ్లలో మొయినుద్దీన్ పలుమార్లు అహ్మదాబాద్ కు వెళ్లినట్లుగా ఏటీసీ అధికారులు గుర్తించారు. కొద్ది కాలం క్రితం గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొంత డబ్బుల్ని తీసుకున్నట్లుగా నిర్ధారించారు. అయితే.. సదరు వ్యక్తి ఎవరో తనకు తెలీదని విచారణలో చెప్పినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా ఈ మాడ్యూల్ లో మరింతమంది ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## హైదరాబాద్ లో యాపిల్ రోడ్.. గూగుల్ గల్లీ.. అమెజాన్ అడ్డా..

హైదరాబాద్,అవును.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త ట్రెండ్ కు తెర తీశారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో నాయకుల పేర్లు.. కాలనీలకు.. రోడ్లకు ఉండటం చూశాం. ఈ తీరుకు భిన్నంగా కొత్త తరహా ఆలోచనను తెర మీదకు తీసుకొచ్చారు సీఎం రేవంత్. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలోని పలు రోడ్లకు వివిధ సంస్థల పేర్లు పెడతామని పేరకొన్నారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్.. అమెజాన్.. మెటా.. టీసీఎస్.. ఇన్ఫోసిస్ లాంటి కంపెనీల పేర్లు పెట్టనున్నట్లుగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తరచూ చెప్పే తెలంగాణ సీఎం.. తాజాగా ఢిల్లీలో జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు - భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సుకు హాజరై.. ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతాన్ని గడిచిన 35 ఏళ్లలో కాంగ్రెస్ తో పాటు వివిధ పార్టీలు పాలించాయని పేర్కొం టూ.. "పెట్టుబడులకు.. పెట్టుబడిదారులకు అన్ని పార్టీలు మద్దతుగా నిలిచాయి. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖద్వారం. హైదరాబాద్ లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. గడిచిన 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో డెవలప్ మెంట్.. సంక్షేమ కార్యక్రమాల్ని చేపట్టాం. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుంది" అన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.తా



ము తలపెట్టిన మూసీ ప్రక్షాళన పూర్తి అయితే లండన్.. టోక్యో.. దుబాయ్.. సియోల్ రివర్ ఫ్రంట్ మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కూడా కొత్త దశలోకి ప్రవేశిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసిన సీఎం రేవంత్.. ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరంలోని పలు రోడ్లకు వివిద సంస్థల పేర్లు పెడతామని ప్రకటించారు.దీంతో..రానున్న రోజుల్లో వివిధ టెక్ సంస్థల పేర్లు వివిధ ప్రాంతాలకు రానున్నాయన్న మాట.తాము ప్రారంభించిన పలు ప్రాజెక్టులు చైనా ప్లస్ వన్ మోడల్ కు గ్లోబల్ సమాధానంగా తెలంగాణ అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు సీఎం రేవంత్. మొత్తంగా రొటీన్ కు భిన్నమైన మోడల్ లో వెళుతున్న రేవంత్ తాను అనుకున్న లక్ష్యాల్ని ఎంత మేర పూర్తి చేస్తారో చూడాలి.

## వేములవాడ రాజన్న ఆలయం మూసివేత..రేవంత్ రెడ్డి కుర్చీకి ప్రమాదమేనా?



హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దక్షిణ కాశీగా వేములవాడ రాజన్న ఆలయాన్ని పిలుస్తూ ఉంటారు.అయితే తెలంగాణ వచ్చిన తర్వాత రాజన్న ఆలయాన్ని చాలానే కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రక్షాళన చేస్తోంది. యాదాద్రి తరహాలో వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి దూసుకు వెళు న్నారు. ఇందులో భాగంగానే తాజాగా దక్షిణ కాశీగా పేరుపొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని మూసివేశారు. మరమ్మత్తుల పేరుతో భీమన్న ఆలయంలో దర్శనాలు జరుగుతున్నాయి. మొత్తం 693.25 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకుంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. మంగళవారం నుంచి ఆలయం ప్రధాన గేటు కూడా ఇనుప రేకులతో మూసివేశారు. ప్రధాన ఆలయంలో స్వామివారికి అర్చకులు మాత్రమే పూజా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. భక్తుల దర్శనాలు, కోడె ముగ్గులు లాంటివి అన్నీ భీమేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్నాయి. ఇలా జరగడం చరిత్రలోనే తొలిసారి. అయితే ఇలా వేములవాడ రాజన్న ఆలయాన్ని మూసివేస్తే సీఎం రేవంత్ రెడ్డి కుర్చీకి ప్రమాదం అని కొంతమంది సెంటిమెంటును నమ్ముతున్నారు.గతంలో సీఎం రేవంత్ రెడ్డి అందుకే వేములవాడ పర్యటనకు ఎక్కువగా రాలేదని చెబుతున్నారు. వేములవాడ రాజన్న ను సీఎం స్థాయిలో కేసీఆర్ ఎప్పుడు దర్శించుకోలేదు. దర్శించుకున్న ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే. సీఎం స్థాయిలో వేములవాడ రాజన్నను దర్శించుకుంటే పదవి పోతుందనే సెంటిమెంటు ఎప్పటి నుంచే ఉంది. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ఏకంగా ఆలయాన్ని మూసివేశారు. దీంతో ఆయన పదవి పోయే ప్రమాదం పొంచి ఉందని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే, దీన్ని కాంగ్రెస్ నేతలు కొట్టిపారేస్తున్నారు.

## జగన్ ఫార్ములా..ఆర్జేడీ కొంప మునిగింది ఇందుకే..!!

పాట్నా:దేశవ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే చర్చ. అదే బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు. రెండు దశల్లో బీహార్ అసెంబ్లీకి పోలింగ్ జరిగింది. 1951లో తొలిసారి రాష్ట్రానికి అసెంబ్లీ ఎన్నికలు జరుగగా ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కాలేదు.ఏకంగా 69శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఈ సారి ఫలితాలు నువ్వా నేనా అన్నట్లుగా ఉంటాయని అంతా అంచనా వేశారు. కానీ రియల్ పిక్చర్ మాత్రం ఇందుకు భిన్నంగా కనిపించింది. ఎన్డీయే కూటమి కూల్‌గా విజయం వైపు అడుగులు వేస్తోంది. ఇక ఎప్పటి నుంచో సీఎం పీఠం కోసం ఎదురుచూస్తోన్న ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్‌కు మరో సారి భంగపాటు కలిగింది. మరో ఐదేళ్లు ప్రతిపక్షానికే పరిమితం కావాల్సి వస్తోంది. తేజస్వీ లేదా ఆర్జేడీ కూటమి ఓటమిపాలు కావడానికి ప్రధానంగా ఐదు కారణాలు కనిపిస్తున్నాయి.

52 టికెట్లు యాదవ సామాజిక వర్గానికి..

బీహార్‌లో కులరాజకీయమే రాజ్యమేలుతుందనేది ఓపెన్ సీక్రెట్. తేజస్వీ యాదవ్ కూడా కులాల ఈక్వేషన్‌ను నమ్ముకుని టికెట్లు కేటాయించడం జరిగింది.ఇదే ప్రధానంగా దెబ్బతీసిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తన సొంత సామాజికవర్గమైన యాదవ సామాజిక వర్గానికి 52 టికెట్లను కేటాయించారు. అయితే ఈ నిర్ణయమే ఆర్జేడీకి నష్టం కలిగించింది. 52 సీట్లు యాదవ్ కులానికి కేటాయించడంతో యాదవేతరులు లేదా నాద్ యాదవ్ కమ్యూనిటీ ఆర్జేడీకి దూరమైందనే చెప్పాలి. జనాభాలో 14శాతం యాదవులు ఆర్జేడీకి ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు.దీంతో ఇతర అగ్ర కులాలు, వెనకబడిన సామాజిక వర్గాలు మహాకూటమికి దూరం అయ్యారు.ఆర్జేడీ మొత్తం 144 స్థానాల్లో పోటీ చేయగా, అందులో 52 మంది యాదవులు ఉన్నారు. బీజేపీ తమ ఎన్నికల ప్రచారంలో '%=జీణ% యాదవ రాజ్' అనే కథనాన్ని బలంగా వినిపించింది.ఇది పట్టణ,మధ్య తరగతి ఓటర్లలో బాగా ప్రతిధ్వనించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ మాదిరిగా, తేజస్వి కూడా 30-35 స్థానాలు యాదవ సామాజిక వర్గానికి మాత్రమే కేటాయించి ఉండి ఉంటే, కుర్మి-కోయిరి వంటి వర్గాల ఓట్లు పెరిగే అవకాశం ఉండేది.

మిత్రపక్షాలను విస్మరించడం...

ఇదిలా ఉంటే తేజస్వీ యాదవ్ వ్యూహంలో కూడా అతిపెద్ద లోపం కనిపించింది.మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు ఇతర చిన్న పార్టీలను విస్మరించడం.సీట్ల పంపకాల వివాదం కూడా మహాకూటమిని బలహీనపరిచి ఉండొచ్చు.కాంగ్రెస్ 'హామీల' మేనిఫెస్టోపై దృష్టి పెడితే, తేజస్వి కేవలం 'ఉద్యోగాలు' అనేదానికే ప్రాధాన్యత ఇచ్చారు, ఇది మిత్రపక్షాలకు రుచించలేదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రచారంలోనూ రాహుల్ గాంధీ వంటి మిత్రపక్ష నాయకులకు వెనుక సీటు ఇచ్చి, కేవలం తానే ప్రమోట్ అయ్యేలా తేజస్వీ




చొరవ చూపడంతో మైనస్ అయి ఉండొచ్చు.

వాగ్దానాలకు బ్లూప్రింట్ ఇవ్వలేకపోవడం

తేజస్వి అతిపెద్ద హామీ (ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం, పింఛను వంటివి) చేసినా, వాటికి సంబంధించిన ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళిక (బ్లూప్రింట్‌ను) ఇవ్వలేకపోవడం ఓటర్లలో అపనమ్మకాన్ని సృష్టించింది. నిధులు, అమలు ప్రణాళికపై స్పష్టత లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. 'మరో 2 రోజుల్లో బ్లూప్రింట్ వస్తుంది' అని ప్రతిరోజూ చెబుతూ వచ్చినా, ఎన్నికల ప్రచారం ముగిసే వరకు ఆ స్పష్టత రాలేదు. దీంతో ఓటర్లలో ఆయన వాగ్దానాలపై విశ్వాసం సన్నగిల్లింది.

మహాకూటమికి ముస్లిం పక్షపాత ముద్ర

మహాకూటమికి ఉన్న 'ముస్లిం-పక్షపాత' ముద్ర కూడా తేజస్వి యాదవ్ ఓటమికి పెద్ద కారణంగా నిలిచింది. ముస్లింలు అధికంగా ఉన్న స్థానాల్లో మహాకూటమికి మద్దతు లభించినా, రాష్ట్రవ్యాప్తంగా ఈ ముద్ర నష్టం చేసింది. బీహార్‌లో అధికారంలోకి వస్తే వక్ఫ్ బిల్లును అమలు చేయబోమని తేజస్వి యాదవ్ చేసిన ప్రకటన కొందరు యాదవులకు కూడా నచ్చలేదు. బీజేపీ ఈ అంశాన్ని, ముఖ్యంగా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా లాలూ ప్రసాద్ పార్లమెంటులో ఇచ్చిన పాత ఉపన్యాసాన్ని బాగా వైరల్ చేయడం, ఎన్డీఏకు ప్రయోజనం చేకూర్చింది.

తండ్రి లాలూ ప్రసాద్ వారసత్వంపై గందరగోళ వైఖరి

తేజస్వి యాదవ్ లాలూ ప్రసాద్ వారసత్వం ద్వారా సామాజిక న్యాయ ఎజెండాను అందిపుచ్చుకోవాలని ప్రయత్నించినా, 'జంగిల్ రాజ్' (అరాచక పాలన) ముద్రకు భయపడి, ఆయనకు దూరం పాటించారు. పోస్టర్‌లలో లాలూ ఫోటోను చిన్నదిగా చేసి 'కొత్త తరం' నాయకుడిగా చూపించడానికి ప్రయత్నించడం గందరగోళాన్ని సృష్టించింది. ప్రధాని నరేంద్ర మోదీ గోపాల్‌గంజ్ ర్యాలీలో మాట్లాడుతూ, "తేజస్వి లాలూ పాపాలను దాచడానికి ప్రయత్నిస్తున్నారు" అని విమర్శించడానికి ఈ వైఖరే అవకాశం ఇచ్చింది.ఈ ద్వంద్వ నీతి చివరకు తేజస్వికి విరుద్ధంగా మారింది.

## సంపాదకీయం

శనివారం 15-11-2025

# వారసుల చేతికి వేగంగా డిపాజిట్లు

బ్యాంకు ఖాతాదారుడు ఎవరైనా మరణించినప్పుడు, అతని పేరిట ఉన్న డిపాజిట్లు వారసులకు బదిలీ కావడానికి ప్రస్తుత నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. ఈ విషయంలో ఒక్కో బ్యాంకు ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఈ దుస్థితిని తప్పించేందుకు రిజర్వు బ్యాంకు తాజాగా మార్గదర్శకాలను విడుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలయ్యే ఈ కొత్త నిబంధనల ప్రకారం- మరణించిన ఖాతాదారుల వారసులకు డిపాజిట్లను బదిలీచేసే విషయంలో అన్ని బ్యాంకులూ ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

ఎవరైనా ఖాతాదారుడు మరణించినప్పుడు చాలా బ్యాంకులు నామినేషన్ ఉన్నాసరే, రకరకాల పత్రాలు కావాలంటూ సంబంధిత వారసులను ఇబ్బంది పెడుతున్నాయి. నామినేషన్ లేకుండా ఖాతాదారుడు మరణిస్తే, కోర్టు ద్వారా పొందిన వారసత్వ హక్కుపత్రాలను తీసుకురమ్మంటున్నాయి. పూచీకత్తు కావాలనీ మెలిక పెడుతున్నాయి. దానివల్ల డబ్బులు వెంటనే చేతికందక బాధిత కుటుంబాలకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇలా కాకుండా, నామినీలకు వెంటనే డబ్బు అందించేందుకు ఆర్‌బీఐ తీసుకొచ్చిన తాజా మార్గదర్శకాలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులతో పాటు సహకార బ్యాంకులూ అనుసరించాల్సి ఉంటుంది.

కొత్త నిబంధనలు ఏం చెబుతున్నాయి?

ఆర్‌బీఐ నూతన నిబంధనల ప్రకారం- బ్యాంకు ఖాతాదారుడు మరణించి, నామినేషన్ ఉంటే... కోర్టుల నుంచి ఎలాంటి ఆదేశాలు తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు. ఆర్‌బీఐ మార్గదర్శకాలతో పాటు ఇచ్చిన అనెక్షర్-1 ఫారాన్ని నింపి... ఖాతాదారుడి మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు క్లెయిమ్ చేస్తున్నవారు తమ గుర్తింపు పత్రాన్ని బ్యాంకుకు సమర్పిస్తే సరిపోతుంది. ఒకవేళ నామినేషన్ లేకుండానే అకౌంట్ హోల్డర్ మరణిస్తే మాత్రం- ఖాతాదారుడి డెత్ సర్టిఫికెట్, తమ గుర్తింపు పత్రాలతో పాటు అనెక్షర్ 1-ఈలో పేర్కొన్న డిక్లరేషన్ ఫారంపై పరిచయస్తులతో సంతకం చేయించి బ్యాంకుకు సమర్పించాల్సి ఉంటుంది. ఇవి మినహా, ఇతరత్రా పూచీకత్తు కావాలని బ్యాంకులు అడగడానికి వీల్లేదు. ఈ పద్ధతిలో సంబంధిత వారసులు సహకార బ్యాంకుల నుంచి రూ.అయిదు లక్షల వరకుబీ ఇతర వాణిజ్య బ్యాంకులైతే రూ.15లక్షలవరకు డబ్బులు పొందవచ్చు. అంతకుమించి డిపాజిట్లు ఉంటే మాత్రం- పైన చెప్పిన పత్రాలతో పాటు అనెక్షర్-1లోని డిక్లరేషన్ ఫారాన్ని క్లెయిమ్ చేస్తున్నవారు తమకు తెలిసినవారితో నోటరీ చేయించాలి. లేదంటే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా న్యాయాధికారి సమక్షంలో వారితో సంతకం చేయించి బ్యాంకుకు ఇవ్వాలి. నూతన మార్గదర్శకాల ప్రకారం- వీలునామా కేసులు, కోర్టు వివాదాల్లో ఉన్నవాటికి సంబంధించిన డిపాజిట్లను బ్యాంకులు పరిష్కరించకూడదు. ఈ విషయంలో కోర్టు ఆదేశాల ప్రకారమే బ్యాంకులు నడుచుకోవాలి. వీలునామా ద్వారా క్లెయిమ్ చేయదలిస్తే, కోర్టు ద్వారా ధ్రువీకరించిన వీలునామాను సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ వీలునామా లబ్ధిదారులతో పాటు మిగతా వారసులకూ సమ్మతమైతే... కోర్టు ద్వారా ధ్రువీకరించుకోవాల్సిన అవసరం లేకుండానే బ్యాంకులు క్లెయిమ్‌ను పరిష్కరించవచ్చని ఆర్‌బీఐ సూచించింది. ఈ విషయంలో వీలునామా, కోర్టు ఆదేశాలు తప్ప మరే ఇతర పత్రాలనూ గ్యారంటీగా సమర్పించాలని బ్యాంకులు అడగకూడదు. టర్మ్ డిపాజిట్ గడువు తీరకముందే డిపాజిట్‌దారుడు మరణిస్తే- ఎలాంటి పెనాల్టీ రుసుము లేకుండానే వారసులకు డిపాజిట్ సొమ్మును అందించాలి. ఈ విధంగా చెల్లింపులు జరిపే విషయాన్ని టర్మ్ డిపాజిట్ అప్లికేషన్ ఫారంలోనే బ్యాంకులు స్పష్టంగా ఖాతాదారులకు తెలియజెప్పాలి.

పక్షం రోజుల్లో పరిష్కారం...

ఖాతాదారులు ఎవరైనా ఏడేళ్లపాటు కనిపించకుండాపోతే, వారిని మరణించినట్లుగానే పరిగణిస్తారు. అలాంటి సందర్భంలో ఖాతాదారుల కుటుంబ సభ్యులు సొమ్ములను క్లెయిమ్ చేసుకోవడానికి ప్రస్తుతం ఏడేళ్లపాటు నిరీక్షించాల్సి వస్తోంది. అంతకాలం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండానే బ్యాంకులు ఎఫ్ఐఆర్ కాపీ, పోలీసు రిపోర్టు ఆధారంగా కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల వరకు చెల్లించవచ్చని ఆర్‌బీఐ నూతన మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. నామినేషన్ లేని సందర్భాల్లోనూ పైన చెప్పిన విధానాన్నే అనుసరించాలి. అనెక్షర్-1బి ఫార్మాట్ ద్వారా లాకర్లలో ఉన్న వస్తువులను ఖాతాదారుల కుటుంబ సభ్యులు క్లెయిమ్ చేసుకోవచ్చు. వారు అన్ని పత్రాలు సమర్పించిన 15 రోజుల్లో క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఆర్‌బీఐ పేర్కొంది. ఒకవేళ బ్యాంకుల వల్ల క్లెయిమ్‌ల పరిష్కారం ఆలస్యమైతే, ప్రస్తుత వడ్డీ రేటుకు మరో నాలుగు శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, లాకర్ క్లెయిముల పరిష్కారంలో 15 రోజులకు మించి జాప్యం చేస్తే- ఆపై ప్రతిరోజూ జాప్యానికి అయిదు వేల రూపాయల చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఖాతాలు తెరిచే సమయంలోనే నామినేషన్ ప్రక్రియను పూర్తిచేస్తే... క్లెయిముల పరిష్కారం వారసులతో పాటు బ్యాంకులకూ సులభమవుతుంది. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొందరు, అవగాహనా రాహిత్యంవల్ల మరికొందరు ఎలాంటి నామినేషన్ లేకుండానే బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించడానికి, నామినేషన్‌ను తప్పనిసరి చేస్తూ ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరముంది.

# మమ్దానీ చేసి చూపించగలరా?

న్యూయార్క్:అమెరికాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ, వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మీ, సిన్సినాటి మేయర్‌గా ఆఫ్తాబ్ పురేవాల్ ఎన్నికయ్యారు. భారత సంతతికి చెందిన వీరిలో మమ్దానీ విజయం అందరినీ ఆకర్షించింది. నగర జీవన వ్యయం ప్రజలకు అందుబాటులో లేదనీ, తాను మేయర్‌నైతే ఈ సమస్యను ప్రజాస్వామ్య, సామ్యవాద విధానాలతో పరిష్కరిస్తాననీ ఆయన హామీ ఇచ్చారు. దీనికితోడు వ్యక్తిగత ఆకర్షణ, అనర్గళ వాగ్ధాటి, పదునైన ప్రచార వ్యూహాలతో 50 ఏళ్ల ఓటింగ్ రికార్డులను బద్దలుకొట్టి మరీ 34 ఏళ్ల ఈ యువనేత గెలిచారు. కానీ, తన వాగ్దానాలను నిలబెట్టుకోవడం మమ్దానీకి అంత సులభమేమీ కాదు.న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ప్రత్యర్థులను మట్టికరిపించిన డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ- ఇప్పుడు వార్తల్లో వ్యక్తి అయ్యారు. కానీ, ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన తీవ్ర విమర్శలెన్నింటినో ఎదుర్కొన్నారు. తోటి పోటీదారులు కోమో, ఆడమ్స్, స్లివాలతో పాటు సెనెటర్ క్రూజ్, రిపబ్లికన్ పార్టీ ప్రముఖులు, రైట్ వింగ్ టీవీ వ్యాఖ్యాతలు... సైద్ధాంతికంగానే కాకుండా, మతద్వేషంతో, జాతి వివక్షతో అత్యంత పరుషమైన భాషలో మమ్దానీపై విమర్శల దాడికి దిగారు. ప్రజాస్వామ్య సామ్యవాది(డెమోక్రటిక్ సోషలిస్ట్)గా ప్రకటించుకున్న ఆయనను 'కమ్యూనిస్టుగా, కమ్యూనిస్ట్ జిహాదీగా, ప్రపంచ తీవ్రవాదానికి ట్రోజన్ హార్స్'గా ప్రత్యర్థులు అభివర్ణించారు. అధ్యక్షుడు ట్రంప్ సైతం మమ్దానీని 'వందశాతం కమ్యూనిస్ట్ పిచ్చోడు' అన్నారు. మమ్దానీ మతవిశ్వాసాన్ని ఎత్తిచూపుతూ- 'ఇంతిఫాదా, ఉగ్రవాద సానుభూతిపరుడు, హమాస్ ఉగ్రవాది, పూర్తిస్థాయి జిహాదీ, ఒసామా-బిన్ మమ్దానీ' వంటి తీవ్ర అభ్యంతరకర పదజాలాన్ని వాడి 9/11 దాడులతో ఆయనకు ముడిపెట్టే ప్రయత్నం చేశారు. అమెరికా పౌరుడైన మమ్దానీ రూపాన్నీ, వలస నేపథ్యాన్నీ ప్రత్యర్థులు వేలెత్తి చూపుతూ కించపరిచారు. మమ్దానీని దేశ బహిష్కరణ చేయాలనీ, ఆయన ఉగాండాకు తిరిగి వెళ్లిపోవాలనీ, ఇది 'న్యూయార్క్-స్థాన్' కాదంటూ జాతి విద్వేషాన్ని వెళ్లగక్కారు.

ఆ మాటకు అర్థమేంటి?

ప్రత్యర్థుల విమర్శలను మమ్దానీ చిరునవ్వుతోనే ఎదుర్కొన్నారు. వాటిని పెద్దగా పట్టించుకోకుండా ప్రచారంపైనే దృష్టి సారించారు. న్యూయార్క్‌లో జనజీవితాలను మెరుగుపరిచేందుకు తానేం చేస్తానన్నది చెప్పుకొచ్చారు. ఫాక్స్ టీవీ ఇంటర్వ్యూలోనూ ట్రంప్‌ను ఉద్దేశించి క్లిష్టమైన ప్రశ్నలన్నింటికీ సూటిగా సమాధానాలిచ్చారు. ఆరు నెలల క్రితం మమ్దానీ ఎవరో న్యూయార్క్‌లో పెద్దగా ఎవరికీ తెలియదు. అలాంటిది, దాదాపు 85లక్షల మంది నివసిస్తున్న ప్రపంచస్థాయి నగరానికి మేయర్‌గా ఎన్నిక కావడం కొందరికి ఉత్తేజం కలిగిస్తే- ఆయన విశ్వాసాలూ సిద్ధాంతాలూ మరికొందరిలో ఆందోళన రేకెత్తించాయి.మమ్దానీ ఎన్నికల ప్రచారంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును యుద్ధ నేరస్థుడిగా పేర్కొన్నారు. తాను మేయర్‌నయ్యి, నెతన్యాహు ఒకవేళ న్యూయార్క్ వస్తే మాత్రం ఆయనను అరెస్టు చేయిస్తానని వ్యాఖ్యానించారు. దీనిపై బాగా చర్చ జరిగింది. మమ్దానీ తన ప్రచారంలో 'గ్లోబలైజ్డ్ ఇంతిఫాదా' అనడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ముఖ్యంగా ఇజ్రాయెల్ అనుకూలురు, సంప్రదాయవాద ప్రత్యర్థులు ఈ మాట ఉగ్రవాదాన్ని కీర్తిస్తోందనీ, మమ్దానీ రాజకీయ తీవ్రవాదానికి నిదర్శనమనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్త హింసాత్మక ఘర్షణకు పిలుపివ్వడం ద్వారా యూదు వ్యతిరేకతను ఆయన ప్రేరేపిస్తున్నారంటూ విమర్శించారు. అయితే, దీనికి మమ్దానీ- అరబిక్‌లో 'వదిలించుకోవడం, తిరుగుబాటు' అనే అర్థంలోనే ఇంతిఫాదా అనే మాటను అన్నానంటూ చెప్పుకొచ్చారు. అయినాసరే, తీవ్రస్థాయిలో ముసురుతున్న విమర్శలను తగ్గించుకోవడానికి ఆయన కాస్త దిగివచ్చి, భవిష్యత్తులో ఈ మాటను



ఉపయోగించకుండా ప్రయత్నిస్తానన్నారు. అదే సమయంలో పాలస్తీనా అనుకూల వైఖరికి మాత్రం మమ్దానీ కట్టుబడ్డారు.

నిధులు ఎలా తెస్తారు?

మమ్దానీ ప్రతిపాదించిన యూనివర్సల్ చైల్డ్‌కేర్‌కు సుమారు ఆరు బిలియన్ డాలర్లు, ఉచిత బస్ సేవకు 800 మిలియన్ డాలర్లు, సిటీ ఆధ్వర్యంలోని కిరాణా దుకాణాలకు 60 మిలియన్ డాలర్లు అవసరం. ఇన్ని నిధులను ఎలా సమకూరుస్తారన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అందుకాయన సమాధానమిస్తూ- కార్పొరేట్ ఆదాయపు పన్నును 11.5శాతానికి పెంచుతా మన్నారు. ఒక మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపాదించేవారి వ్యక్తిగత ఆదాయపు పన్నుపై రెండు శాతం సర్‌ఛార్జ్ విధిస్తామన్నారు. కానీ, ఇలా పన్నులు పెంచే విషయంలో నగర పాలక సంస్థకు ఉండే అధికారం చాలా పరిమితం. ఇదే చేయాలంటే మమ్దానీకి రాష్ట్ర శాసనసభ, గవర్నర్ నుంచి అనుమతి తప్పనిసరి. అర్జెంటినా అధ్యక్షుడు హావియర్ మిలె తనను తాను లిబర్టేరియన్‌గా ప్రకటించుకున్నారు. కానీ, తన విధానాలను బలవంతంగా అమలుచేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఆయన విధానాలు వినాశకర ఫలితాలిచ్చాయి. దాంతో ఆయన అమెరికా నుంచి 40 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీ కోసం అభ్యర్థించారు. అధ్యక్షుడిగా తాననుకున్నది అమలు చేయడానికి మిలెకి విస్తృతమైన అధికారాలున్నాయి. కానీ, మేయర్‌గా తన విధానాలకు నిధులు సమకూర్చుకునే అవకాశాలు మమ్దానీకి చాలా తక్కువ.

ట్రంప్ ప్రతీకారం ప్రదర్శిస్తారా?

మమ్దానీ తన విజయ ప్రసంగంలో 'డొనాల్డ్ ట్రంప్! సౌండ్ పెంచుకుని వినండి' అంటూ పలుసార్లు అధ్యక్షుణ్ని ఉద్దేశించి నేరుగా మాట్లాడారు. ప్రత్యర్థులపై పగ, ప్రతీకారం తీర్చుకోవడాన్నే తన పాలనా విధానంగా మార్చుకున్న ట్రంప్- మమ్దానీపై ఆగ్రహంతో తన స్వస్థలమైన న్యూయార్క్‌కు కచ్చితంగా నిధులు నిలిపేస్తారని అంతా భావిస్తున్నారు. కాబట్టి, మమ్దానీ తన వాగ్దానాల్లో చాలావాటిని నెరవేర్చడం అసంభవమని పలువురు భావిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యమేమిటంటే- మమ్దానీకి ఓటేసిన వారిలోనూ 60శాతం మందికిపైగా ఇదే అభిప్రాయాన్ని ఓ సర్వేలో చెప్పారు! ఏదిఏమైనా మమ్దానీ అమెరికా రాజకీయాల్లో రాణించడం, ముఖ్యంగా ఇక్కడి దక్షిణాసియా సంతతివారికి ఒక చారిత్రక ఘట్టం. ఆయన విజయం డెమోక్రటిక్ పార్టీకి ఒక సరికొత్త మైలురాయి. మమ్దానీ రాజకీయ ఎదుగుదల వలసదారులతో నిండిన న్యూయార్క్ నగర ప్రత్యేక పరిస్థితులకు మాత్రమే పరిమితం కావచ్చు. కానీ, అమెరికన్లలో రాజకీయ అభిప్రాయాల వృద్ధికీ, వ్యక్తీకరణకూ న్యూయార్క్ మేయర్ ఎన్నికలు అద్దం పట్టాయనే చెప్పాలి.

# ఉగ్రవాదం.. ఇంకెంత కాలం?



న్యూఢిల్లీ,తమ హయాంలో ఉగ్రవాదాన్ని అంతమొందించామని కేంద్రంలోని ప్రభుత్వ నేతలు ఘనంగా ప్రచారం చేసుకుంటున్న సమయంలో ఢిల్లీలో దేశ సార్వభౌమత్వానికి చిహ్నంగా భావించే ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఉగ్రదాడి దేశప్రజలను గగుర్పాటుకు గురిచేసింది. దేశరాజధాని కేవలం ప్రపంచంలో దారుణమైన కాలుష్యాన్ని ఆవహించిన నగరమే కాకుండా ఉగ్రభయం తో వణికిపోతున్న రాజధానిగా మారిపోతుంది. విదేశీ ఉగ్రవాదులతో సంబంధం గల నలుగురు వైద్యులను నాలుగు రోజుల్లో అరెస్ట్ చేసిన సమయంలో మరో వైద్యుడు ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు వెల్లడికావడం ఆందోళన కావిస్తుంది. అదృష్టవశాత్తు ఆ రోజు ఎర్రకోటకు సెలవు రోజు కావడంతో, అక్కడ జనసమర్ధన తక్కువగా ఉండడంతో ప్రాణనష్టం తక్కువగా జరిగింది. లేనిపక్షంలో ఎవ్వరూ ఊహించని దారుణం చోటుచేసుకొని ఉండెడిది.పేదరికం, అక్షరాస్యత లేకపోవడం, నిరుద్యోగం వల్లే కొందరు ఉగ్రవాదులుగా మారుతున్నారని దేశంలో పలువురు రాజకీయ వేత్తలు, విద్యావంతులు వారిపట్ల ఒక విధమైన సానుభూతితో మాట్లాడుతూ ఉంటారు. అయితే డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నత విద్యావంతులు ఉగ్రవాద సంస్థలలో కీలక భూమిక వహిస్తున్నట్లు గత రెండు దశాబ్దాలుగా దేశంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అరెస్టులు స్పష్టం చేస్తున్నాయి. కేరళ వంటి ప్రాంతాల నుండి ఐఎస్ఐఎస్‌లో చేరేందుకు అఫ్ఘానిస్తాన్‌కు వెళ్లిన వారి నుండి, దేశంలో కరడుగట్టిన ఉగ్రవాద సంస్థలలో క్రియాశీలంగా వహిస్తున్న వారిలో పలువురు ఉన్నత విద్యావంతులు ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ (35) ను గుజరాత్‌లో అరెస్టు చేయడం భద్రతా దళాలలో ప్రకంపనలు సృష్టించింది. చైనా నుండి మెడికల్ డిగ్రీ అందుకొన్న అతను ఆముదం గింజల నుంచి రిసిన్ అనే విషపూరిత పదార్థాన్ని చేస్తున్నట్లు గుర్తించారు. ప్రసాదాలలో ఆ విషపదార్థాన్ని కలిపి భారీ సంఖ్యలో జనాన్ని మట్టుపెట్టాలని అతను పథకాలు వేసుకున్నట్లు కనుగొన్నారు.జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 అమలు రద్దు చేయడంతో అక్కడి ఉగ్రవాదంను కట్టడి చేసినట్లే అని చెప్పుకుంటూ వచ్చారు. అయితే, తాత్కాలిక చర్యగా పేర్కొన్న జమ్మూ కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడాన్ని ఆరేళ్ళు దాటినా ఎందుకు వెనుకకు తీసుకొని, తిరిగి రాష్ట్ర హోదా కల్పించలేకపోతున్నారు? కేంద్ర హోం శాఖ ప్రత్యక్ష పర్యవేక్షణలో అక్కడ శాంతిభద్రతలు నిర్వహిస్తున్నారు.అయితే, సీమాంతర ఉగ్రవాదం ఇంకా అదుపులోకి రాలేదని ప్రభుత్వ చర్యలే స్పష్టం చేస్తున్నాయి.గతంలో యుపిఎ ప్రభుత్వం గాని, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం గాని ఉగ్రవాదాన్ని రాజకీయ ప్రచార అస్త్రంగా ఉపయోగించుకోవడం లో చూపిన శ్రద్ధ దానిని అణచివేయడంపట్ల చూపడం లేదు. ఆపరేషన్ సిందూర్‌ను అర్ధాంతరంగా ఎందుకు ఆపివేసారో ఇప్పటి వరకు ప్రభుత్వం దేశప్రజలకు నమ్మకమైన సమాధానం చెప్పలేకపోయింది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ వణికిపోయిందని, తిరిగి భారత్ వైపు చూసే సాహసం చేయబోదని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ నిత్యం చెబుతున్నారు. అయితే ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగానే ఢిల్లీ పేలుడు జరుగుతున్నట్లు వార్తలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.25 ఏళ్ల క్రితం నాటి బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వాన్ని ప్రస్తావిస్తూ తిరిగి 'జంగిల్ రాజ్' వస్తుందని బీహార్ ప్రజలను ఎన్నికల సందర్భంగా భయపెడుతున్న ప్రధాన మంత్రి మోడీ ఎన్‌డిఎ పాలనలో ఆ రాష్ట్రంలో ప్రభుత్వ గణాంకాల ప్రకారమే నేరాల సంఖ్య పెరిగిన విషయాన్ని మరచిపోతున్నారు. 60 క్రితం చనిపోయిన మాజీ ప్రధాని నెహ్రూ విధానాలను ఇప్పటికీ నిత్యం విమర్శిస్తూ తమ ప్రభుత్వంలో దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఆర్థిక తారతమ్యాలు పెరిగిపోతూ ఉండటం, వైషమ్యాలు పెరిగిపోతూ ఉండటం గురించి నోరు విప్పడంలేదు. యుపిఎ ప్రభుత్వం ఉగ్రవాదులపట్ల రాజీధోరణి అవలంబించిందని విమర్శలు చేస్తుండే నేతలు తమ హయాం లో జరుగుతున్న ఉగ్రదాడుల గురించి నోరెత్తరు. 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను బలి తీసుకున్న పుల్వామా ఉగ్రదాడికి దారితీసిన పరిస్థితులపై ఇప్పటివరకు దర్యాప్తు నివేదికను బయటపెట్టలేదు. గత 11 ఏళ్లలో దేశంలో 68 ఉగ్రదాడులు జరిగాయి. ఈ దాడులలో 600మంది వరకు మృతి చెందారు. వారిలో సగంమందికి పైగా 360 మంది వరకూ సైనికులు, పోలీసులు అమరులవ్వగా, 230 మంది పౌరులు మృతి చెందారు. గతంలో లేని విధంగా తరచూ సైనికులను, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడులు జరుగుతున్నాయి. నోట్ల రద్దుతో ఉగ్రవాదులకు ఆదాయ వనరులను కట్టడి చేశామని చెప్పారు. కానీ అటువంటి పరిస్థితులు కనబడటం లేదు. మెరుపు దాడులలో ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారు. కానీ, సైనిక అధికారులే నియంత్రణ రేఖ అవతల దేశంలో ప్రవేశించేందుకు పెద్ద సంఖ్యలో చొరబాటుదారులు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా సైన్యంలో కొత్త నియామకాలు దాదాపు ఆగిపోయాయి. కొత్తగా ప్రవేశపెట్టిన అగ్నివీర్ కార్యక్రమం గురించి స్పష్టమైన సమీక్షలు జరగడం లేదు. ఈ విషయంలో సైనికాధికారులకు, ప్రభుత్వంకు మధ్య దూరం పెరుగుతున్నట్లు పలువురు భావిస్తున్నారు. యుపిఎ హయాంలో అమెరికా ఒత్తిడి కారణంగానే బొంబాయి పేలుళ్ల తర్వాత భారత్ పాకిస్థాన్‌పై దాడి చేయలేదని అప్పటి కేంద్ర మంత్రి పి చిదంబరం వెల్లడించారు.కానీ ఆపరేషన్ సిందూర్ సందర్భంగా అర్ధాంతరంగా 'కాల్పుల విరమణ' ఎందుకు జరపాల్సి వచ్చిందే పార్లమెంట్‌లో సైతం ప్రభుత్వం నోరువిప్పడం లేదు. తానే భారత్ పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికీ చెప్పుకొంటున్నారు. ఆయనను నేరుగా ఎందుకు ఖండించలేకపోతున్నారు? ఆయన వ్యాఖ్యలపట్ల అమెరికా రాయబారిని పిలిచి భారత్ ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయడం లేదు? తన ఒత్తిడులకు లొంగి భారత్ రష్యా నుండి చమురు కొనుగోలు తగ్గిస్తున్నట్లు తాజాగా ట్రంప్ ప్రకటించారు. అయినా భారత్ మౌనం వహిస్తున్నది. తాజా అరెస్ట్‌లతో సుదీర్ఘకాలంగా బిజెపి పాలనలో ఉన్న హర్యానా ఉగ్రవాదులకు కీలక ప్రాంతంగా మారుతున్నట్లు అనుమానించే పరిస్థితులు నెలకొంటున్నాయి.

# పేలిన కారులో ఉన్నది ఉమర్ నబీయే

న్యూఢిల్లీ, ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడుకు సంబంధించి మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బాంబు పేలుడు సంభవించిన ఐ20 కారులో ఉన్నది డాక్టర్ ఉమర్ నబీ అని తేలింది.కారులో లభించిన నమూనాలతో అతని డీఎన్ఏ సరిపోలడంతో కారు నడిపింది నబీయేనని అధికారులు నిర్ధారణకు వచ్చారు.గత సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. పేలుడుకు ముందు ఉమర్ కారు నడుపుతున్న సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించారు. దీంతో ఘటన సమయంలో కారులో ఉన్న అతను కూడా ప్రాణాలు కోల్పోయాడని అధికారులు అనుమానించారు. ఈ నేపథ్యంలో పుల్వామాలో ఉన్న అతని తల్లి నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకొని పరీక్షించారు. కారు స్టీరింగ్, యాక్సిలరేటర్ మధ్య ఇరుక్కున్న కాలు నుంచి సేకరించి డీఎన్ఏను ఆమె డీఎన్ఏతో సరిపోల్చారు. దీంతో కారులో లభించిన డీఎన్ఏ ఉమర్ నబీదేనని తేలినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఏడాది జనవరిలో ఎర్ర కోట వద్ద డాక్టర్ ముజమ్మిల్ పలుసార్లు రెక్కీ నిర్వహించినట్లు వెల్లడైందని అధికారులు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నాడు ఎర్ర కోటపై దాడి చేసేందుకు భారీ కుట్ర జరిగిందని, అందులో భాగంగానే ఈ రెక్కీ జరిగిందని పోలీసులు తెలిపారు. అయితే ఆ సమయంలో అక్కడ పటిష్టమైన పోలీసు పెట్రోలింగ్ ఉండడంతో వారి కుట్ర భగ్నమైందని చెప్పారు. బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన డిసెంబర్ 6న భారీ పేలుడుకు రెడ్ ఫోర్ట్ సమీపంలో పేలుడుకు గురైన కారును నడుపుతున్న డాక్టర్ ఉమర్ నబీ కుట్ర పన్నినట్లు బుధవారం అధికార వర్గాలు వెల్లడించాయి. అంతర్రాష్ట్ర వైట్ కాలర్ జైషే మొహమ్మద్ ఉగ్ర మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణపై అరెస్టయిన 8 మందిని పోలీసులు ప్రశ్నించగా ఈ సంచలన వివరాలు వెల్లడైనట్లు ఆ వర్గాలు చెప్పాయి. ఢిల్లీ బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలాహ్ వర్సిటీ పేరు తెరపైకి వచ్చింది. ఈ వర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్లు, ప్రొఫెసర్లు ఉగ్ర కుట్రలో భాగం కావడంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఈ వర్సిటీపై పడింది. ఫరీదాబాద్ పరిధిలోని ధౌజ్ గ్రామంలో 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సంస్థ హర్యానా రాజధానికి కేవలం 30 కి.మీ దూరంలోనే ఉంది. వైట్ కాలర్ టెర్రర్ నెట్‌వర్క్‌కు, రాడికలైజ్డ్ నిపుణుల బృందం తలపెట్టిన ఒక మారణహోమానికి కేంద్ర బిందువుగా మారింది. పోలీసులు, ఇతర దర్యాప్తు బృందాలు పలువురు సిబ్బందిని ప్రశ్నించారు. డాక్టర్ ఉమర్ కాకుండా, ఉగ్ర దాడికి సహకరించారని అనుమానిస్తున్న, జైషే మహ్మద్‌తో సంబంధం ఉన్న అతని ఇద్దరు సహాయకులు డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహిన్ షాహిద్‌లు కూడా ఇదే విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. డాక్టర్ షకీల్‌ను అరెస్ట్ చేయడంతో తనను కూడా అరెస్ట్ చేస్తారన్న భయంతో ఉమర్ సోమవారం కారు బాంబు పేలుడుకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. డాక్టర్ షాహిన్ కారు నుంచి రైఫిళ్లు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆరుగురిని యూనివర్సిటీ నుంచి అరెస్ట్ చేశారు. పేలుడు అనంతరం మరో డాక్టర్ నిసర్-ఉల్-హసన్ పరారీలో ఉన్నాడు. హసన్ ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు. దేశ ద్రోహ కార్యకలాపాలకు పాల్పడ్డాడన్న ఆరోపణపై ఆయనను శ్రీ మహరాజ హరి సింగ్ హాస్పిటల్ నుంచి జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ విధుల నుంచి తొలగించారు. అయితే ఇలాంటి రికార్డు ఉన్న వ్యక్తిని ఈ యూనివర్సిటీలో ఎలా నియమించారన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఇస్తున్న మాట ఇదే !

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన భారీ బాంబు పేలుడు ఘటనలో ఏకంగా 12 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే మరో ఇరవై మంది దాకా క్షతగాత్రులు అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా అమాయకులు. ఏ పాపం పుణ్యం ఎరగని వారు. ఆ రోజున ఆ సమయంలో వారు అక్కడ ఉండడమే నేరం అయింది. అందుకే చనిపోయిన వారు కొందరు గాయాల పాలు అయిన వారు మరికొందరు. ఇలా దేశ రాజధానిలో భీతిల్లే ఘటన జరిగింది. ఒక మారణ హోమం గుండె కోత కోసింది. ఢిల్లీ తల్లడిల్లిపోయింది.

పౌరుల ప్రాణాలే ముఖ్యం :

భూటాన్ లో రెండు రోజుల పర్యటనకు ప్రధాని నరేంద్ర మోడీ వెళ్లారు. ఆయన వెనక్కి తిరిగి వచ్చిన వెంటనే ఢిల్లీలోని ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఇక బుధవారం రాత్రి కేంద్ర కేబినెట్ భేటీ అయింది. మోడీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జాతీయ భద్రత ప్రతి పౌరుడి భద్రత పట్ల తన శాశ్వత నిబద్ధతకు చాటుకుంటామని కేంద్ర మంత్రి వర్గం జాతికి తెలియచేసింది. దానికి అనుగుణంగా భారతీయులందరి ప్రాణాలను వారి శ్రేయస్సును కాపాడాలనే ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని మంత్రివర్గం పునరుద్ఘాటించింది.

ఘన నివాళులు :

అంతే కాదు ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడులో జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణనష్టం పట్ల కేంద్ర మంత్రివర్గం తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అమాయక ప్రాణాలను కోల్పోయిన వారికి గౌరవసూచకంగా రెండు నిమిషాల మౌనం పాటించింది. ఈ అర్థరహిత హింసాకాండ బాధితులకు మంత్రివర్గం తన ఘన నివాళులు అర్పించి మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సంతాపాన్ని తెలియచేసింది. అమాయకుల ప్రాణాలను కోల్పోవడానికి దారితీసిన ఈ దుర్మార్గపు పిరికి చర్యను మంత్రివర్గం నిర్ద్వంద్వంగా ఖండించింది.

నిబద్ధతకు ప్రశంసలు :

ఇలాంటి ఘాతుకం ఉగ్రవాదం అన్ని రూపాలుగా మారి వేయి తలలతో విర్రవీగుతున్న వేళ దేశం చూపించిన నిబద్ధతకు అచంచలమైన విశ్వాసానికి మంత్రివర్గం ప్రశంసించింది అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ధైర్యంతో వ్యవహరించిన అధికారులు, భద్రతా సంస్థలు పౌరుల సకాలంలో సమన్వయంతో స్పందించిన తీరుని మంత్రివర్గం ప్రశంసించింది. ఈ సంఘటనపై దర్యాప్తును అత్యంత అత్యవసరంగా వృత్తి నైపుణ్యంతో కొనసాగించాలని మంత్రివర్గం జాతీయ దర్యాప్తు సంస్థలను ఆదేశించింది, తద్వారా నేరస్థులు వారికి సహకరించిన వారు వారిని ప్రోత్సహించిన వారిని గుర్తించాలని పేర్కొంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించింది. ఇక కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో ప్రస్తుతం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని కూడా కేంద్ర మంత్రి చెప్పారు.

## చికిత్స పొందుతూ మరొకరు మృతి

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 13కి పెరిగింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని చారిత్రక కట్టడం ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. సాయంత్రం 7 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే తొమ్మిది మంది మరణించారు. మరో 20 మంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ తరలించారు.

## మూడో కారు కోసం దర్యాప్తు ముమ్మరం

న్యూఢిల్లీ, ఢిల్లీ పేలుడు కేసులో తాజాగా మరో అరెస్ట్ చోటు చేసుకుంది. పేలుడు కేసులో ప్రధాన అనుమానితుడైన డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న డీఎల్10సీకే0458 అనే ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని ఖండవలి గ్రామంలో బుధవారం కనుగొన్నారు. అయితే, ఆ కారును అక్కడ పార్క్ చేసిన వ్యక్తిని ఫరీదాబాద్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. అతడిని ఫహీమ్‌గా గుర్తించారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు ఎర్రకోట వద్ద పేలుడుతో సంబంధం ఉన్న మూడో కారు కోసం దర్యాప్తు సంస్థలు వేట కొనసాగిస్తున్నాయి. సోమవారం సాయంత్రం తెలుపు రంగు హుందయ్ ఐ20 కారుతో డాక్టర్ ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఉగ్రకుట్ర కోసం మూడు కార్లు వాడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును ఫరీదాబాద్‌లో గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మూడో కారు మారుతీ బ్రీజా కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. ఆ కారు ఆచూకీ చిక్కడం లేదు. నిందితులు ఆ మూడో కారును తప్పించుకోవడం కోసం వాడాలని భావించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు సంస్థలకు చెందిన బృందాలు ఆ కారు కోసం వేట కొనసాగిస్తున్నాయి. మారుతీ బ్రీజా కారును గుర్తించేందుకు ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంతో పాటు సమీప రాష్ట్రాల్లోనూ పోలీసులు వెతుకుతున్నారు.

## కేబినెట్ నిర్ణయంపై అందరి చూపు

హైదరాబాద్, తెలంగాణలో చాలా కాలంగా వాయిదా పడుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణపై.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కసరత్తు చేస్తోంది. హైకోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈనెల 24వ తేదీలోపు తన నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.తెలంగాణ హైకోర్టు గత వారం ఇచ్చిన ఆదేశాల్లో, ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టమైన ప్రకటన చేయాల్సిందేనని పేర్కొంది. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్ల వివరాలు, తేదీలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది.కాగా ఈనెల 17న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల శాతం, ఎన్నికల తేదీలపై ప్రధాన చర్చ జరగనుంది. హైకోర్టు డెడ్‌లైన్ దృష్ట్యా ఈ సమావేశం అత్యంత కీలకంగా మారనుంది.ప్రభుత్వం ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖకు స్థానిక సంస్థల ఎన్నికలపై.. సమగ్ర నోట్ సిద్ధం చేయండి అని ఆదేశించింది. ఎన్నికలకు సంబంధించి అవసరమైన లాజిస్టిక్స్, రిజర్వేషన్ల లెక్కలు, పరిపాలనా ఏర్పాట్లు, బడ్జెట్ వ్యయాలు మొదలైన అంశాలపై శాఖ పనిచేస్తోంది.ముఖ్య కార్యదర్శి సానియా సింఘాల్ నేతృత్వంలో పంచాయతీ రాజ్ అధికారులు, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సమక్షంలో సమావేశమై, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమీక్షించారు.గత 20 నెలలుగా కేంద్ర ఆర్థిక సంఘం రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు విడుదల చేయాల్సిన నిధులను నిలిపివేసింది. దీనికి కారణం స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం. కేంద్రం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం, ఎన్నికైన స్థానిక సంస్థలే నిధులను వినియోగించగలవు. ఈ కారణంగా దాదాపు రూ.3,000 కోట్లకు పైగా నిధులు ప్రస్తుతం విడుదల కాకుండా నిలిచిపోయాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులకు పెద్ద ఆటంకంగా మారింది. ఈ నేపథ్యంతో ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించి, ఆ నిధులను తిరిగి పొందే దిశగా అడుగులు వేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలనే నిర్ణయానికి రాబోతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు హైకోర్టు ఒత్తిడి, మరోవైపు కేంద్ర నిధుల నిలిపివేత కారణంగా ఎన్నికల నిర్వహణకు సానుకూల వాతావరణం ఏర్పడింది. కేబినెట్ నిర్ణయం తరువాత, వచ్చే నెలలోనే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సూచనలు ఉన్నాయి.

## ఐదు రాష్ట్రాల్లో ఎన్‌ఐఏ సోదాలు

న్యూఢిల్లీ,జాతీయ దర్యాప్తు సంస్థ గురువారం ఐదు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. అల్ ఖైదా గుజరాత్ ఉగ్రవాద కుట్రలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల ప్రమేయం ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. ఐదురాష్ట్రాల్లోని దాదాపు పది చోట్ల ఎన్‌ఐఏ తనిఖీలు నిర్వహించింది. పశ్చిమ బెంగాల్, త్రిపుర, మేఘాలయ, హర్యానా, గుజరాత్‌లలో అనుమానితులు, వారి సహచరులకు సంబంధించిన స్థలాల్లో ఎన్‌ఐఏ బృందాలు సోదాలు చేసినట్లుగా ఎన్‌ఐఏ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ కేసు 2023లో నమోదైంది. నలుగురు బంగ్లాదేశ్ జాతీయులు మొహమ్మద్ సోజిబ్ మియాన్, మున్నా ఖలీద్ అన్సారీ, అజ్రుల్ ఇస్లాం, అబ్దుల్ లతీఫ్ పేర్లు ఇందులో ఉన్నాయి. నిందితులు ఫేక్ ఐడీలను ఉపయోగించి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. వారికి నిషేధిత అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో సంబంధం కలిగి ఉన్నట్లుగా గుర్తించారు. బంగ్లాదేశ్‌లోని అల్-ఖైదా కార్యకర్తలకు నిధులు సేకరించడం, బదిలీ చేసినట్లుగా తేలింది. ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించారు. ఎన్‌ఐఏ నవంబర్ 10, 2023న అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో మహారాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ నిషేధిత ఉగ్రవాద సంస్థలు అల్-ఖైదా, భారత ఉపఖండంలోని అల్-ఖైదాతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ పుణెలికు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అరెస్టు చేసింది. ఏటీఎస్ థానేకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని ప్రశ్నించింది. అక్టోబర్ 27న ఏటీఎస్ 37 ఏళ్ల జుబైర్ హంగర్గేకర్‌ను అరెస్టు చేసింది. అతను నిషేధిత సంస్థలతో సంబంధం కలిగి ఉన్నాడని, రాడికలైజేషన్ కార్యకలాపాల్లో పాల్గొన్నాడని ఆరోపణలున్నాయి. దర్యాప్తులో ఏటీఎస్ అతని పాత్రతో పాటు పాకిస్తానీ కాంటాక్ట్ నంబర్‌ను గుర్తించారు.

### ఉలిక్కిపడ్డ మహిపాల్‌పూర్ ప్రాంత ప్రజలు

న్యూఢిల్లీ,ఢిల్లీలో పేలుడు ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ కుట్రకు ఉగ్రవాదులు ప్లాన్ చేశారని తేలడంతో నగర వాసులు భయంతో వణికిపోతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి పేలుడు శబ్దం వినిపించినా ఉలిక్కి పడుతున్నారు. తాజాగా ఢిల్లీలో తాజాగా భారీ శబ్దం కలకలం రేపింది. గురువారం ఉదయం ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మరోసారి పేలుడు జరిగిందని ఆందోళన చెందారు. అయితే, అది పేలుడు కాదని అధికారులు తేల్చారు. ఆ శబ్దం బస్సు టైర్ పేలడం వల్ల వచ్చిందిగా తేల్చారు. ఢిల్లీ అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 'మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో భారీ శబ్దం వచ్చిందంటూ అగ్నిమాపక శాఖకు ఉదయం 9:18 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

# ప్రజలతో నిరంతర మమేకమే మా విధానం



హైదరాబాద్, ప్రజలతో మమేకమై అన్నివర్గాల ప్రజలు తరుపున పోరాటం చేయడమే తమ పార్టీ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ప్రస్తుతం ఏ పార్టీతోనూ తమకు అవగాహన పొత్తు రాజకీయాలు ల?టటవని తెటలిపారు. రాజకీయంగా భద్రశత్రువు అయిన బీజేపీని వ్యతిరేకించే పరిస్థితులు వచ్చినప్పుడు కాంగ్రెస్‌కు అంశాలవారీ మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అంతేగానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని పోరాటాలు ఎక్కడా ఆపలేదని చెప్పుకొచ్చారు. ట్రిపుల్‌ఆర్ భూసేకరణ విషయంలో రైతుల పక్షాన తమ అనుబంధ సంఘమైన రైతు సంఘ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేశారు. అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకే ఆపరేషన్ కగార్ కేంద్రం చేపట్టిందని పేర్కొన్నారు. మావోయిస్టులతో చర్చలు జరపాలన్నదే తమ డిమాండ్ అని పేర్కొన్నారు. తమకు సర్దుబాటు కంటే ప్రజాసమస్యలు పరిష్కరించడమే ముఖ్యమని, అందువల్ల సీపీఐతో కలిసే ప్రసక్తి తమకు లేదని, సీపీఐ లేకుండా వామపక్షాల కూటమి సాధ్యపడదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు తగ్గించినట్లు ఉంది? ఎందువల్ల?

ప్రజల పక్షాన ఉంటూ మా పోరాటాలు ఎక్కడా తగ్గలేదు. పేదలకు అండగా నిలిచేందుకు రాజీలేని పోరాటాలు చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తాం. భవిష్యత్తులో మరిన్ని పోరాటలు చేస్తాం. అవసరమైతే ఉధృతం చేస్తాం. ప్రజాసమస్యల విషయంలో కాంగ్రెస్ వ్యతిరేకంగా నిలబడతాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలపై వినతి పత్రాలు అందజేశాం. ప్రస్తుతం ఉద్యమాల చేపట్టాం. కాంగ్రెస్ పార్టీతో అవగాహన ఒప్పందం లేదని, కానీ బీజేపీని వ్యతిరేకించే విషయంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో మతన్మోద విషయాలపై కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామన్నారు.

చట్టసభల్లో ఎందుకు అడుగు పెట్టలేకపోయారు?

మా పార్టీ సర్దుబాటు రాజకీయాలు చేయడం లేదు. గత అసెంబ్లిఎన్నికల్లో మేము ఒంటరిగా పోటీ చేశాం. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌తో ఎన్నికల అవగాహన ఒప్పందంలో భాగంగా ఒక అసెంబ్లి%ు% సీటును ఇస్తామని చెప్పింది. అయితే ఒక్క సీటు మా పార్టీ వద్దు అనుకొని విడిచి పెట్టింది. ఎన్నికల సమయంలో సీపీఐ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని, భద్రాచలం సీటును దక్కించుకుంది. అదే సమయంలో మేము కోరిన భద్రాచలం ఇవ్వకుండా మిరియాలగూడ సీటును క?టటటాయించారు. దీన్ని మా పార్టీ అంగీకరించల?టటదు. ఎలాంటి పొత్తులు లేకుండా 19 అసెంబ్లి%ు% స్థానాల్లో ఒంటరిగా పోటీ చేశాం. చట్టసభల్లో అడుగు పెట్టలేదని మాకు బాధ లేదు. నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నాం.

వామపక్షాలు కూటమిగా ఏర్పడుతుందా?

సీపీఐ సర్దుబాటు చేసుకుని శాసనసభలో ఒక సీటు, శాసనమండలిలో రెండు సీట్లు దక్కించుకున్నారు. అలాంటి సర్దుబాటు ఏ పార్టీతో మేము చేసుకోవడం లేదు. మాకు సర్దుబాటు కంటే ప్రజాసమస్యలు పరిష్కరించడమే ముఖ్యం. అందువల్ల సీపీఐతో కలిసే ప్రసక్తి మాకు లేదు. సీపీఐ లేకుండా వామపక్షాల కూటమి సాధ్యపడదు.

ట్రిపుల్‌ఆర్ నిర్వాసితుల తరుపున ఉద్యమం ఎందుకు నిలుపు చేశారు?

ట్రిపుల్‌ఆర్ నిర్వాసితుల తరుపున ఉద్యమం ఆపలేదు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలు ఉన్నందున తాత్కలికంగా నిలుపు చేశాం. ట్రిపుల్ ఆర్ కోసం సేకరించిన భూముల విలువ విపరీతంగా పెరిగాయి. అయితే ప్రభుత్వం చెల్లించే మార్కెట్ ధరకు రైతులు అంగీకరిస్తే.. ప్రజాభిప్రాయసేకరణ గ్రామసభల ద్వారా నిర్ణయించి పరిహారం చెల్లించాలి. ఒక వేళ రైతులు అంగీకరించకపోతే భూమికి భూమి ఇవ్వాలని మా డిమాండ్. జూబిహిల్స్ ఎన్నికల అనంతరం ఈ పోరాటం ఉధృతం చేస్తాం. పార్టీ కేంద్ర కమిటీ సూచన మేరకు కార్యాచరణ రూపొందించి పోరాటం ఉధృతం చేస్తాం.

పరువు హత్యలపై మీరు ఎలాంటి పోరాటాలు చేస్తున్నారు?

ఇటీవల కాలంలో పరువు హత్యలు అధికంగా జరుగుతున్నాయి. ఆసిఫాబాద్‌లో కులాంతర వివాహం చేసుకున్న ఆదివాసీ మహిళ శ్రావణి తన మామే హత్య చేశారు. ఈ సంఘటనపై నేను స్వయంగా వెళ్లి పూర్తి వివరాలు సేకరించి పోరాటం చేశాం. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను కూడా ముట్టడి చేశాం. తొమ్మిది నెల గర్భిణి అని చూడకుండా కిరాతకంగా హత్య చేశారు. బిడ్డ పుడితే ఆస్తులు పంచాల్సి ఉంటుందన్న భావనతోనే హత్య జరిగింది. ఇలాంటి హత్యలు నివారించాలంటే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. హత్యకు గురైన ఆమె కుటుంబానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, ఇల్లు, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడి చేశారు. తమ డిమాండ్లు ఈ నెల 20వ తేదీలోగా నెరవేర్చాలని, లేకుంట??ట కలెక్టరేట్ ముట్టడి చేయనున్నాం.

మీరు రాష్ట్రకార్యదర్శిగా ఎన్నికైన తర్వాత పార్టీని ఎలా నిర్మాణం చేస్తున్నారు?

సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభల్లో తాను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యాను. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలపై పోరాటం చేయకుండా స్థానిక సమస్యలపై పోరాటం చ?టటస్తాం. తొలుత ఐదారు నెలలు స్థానిక సమస్యలపై పోరాటం చేస్తాం. క్షేతస్థాయిలో కార్యకర్తలు, నాయకులు పర్యటించి స్థానిక సమస్యలు గురించి తెలుసుకుని పోరాటాలు చేస్తాం.

మీ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఎందుకు తగ్గింది?

తాత్కలిక ప్రయోజనాలను ప్రజలు ఆశిస్తున్నారని, దీర్ఘకాల అభివృద్ధి కోసం ఎవరూ ఆలోచించడం లేదు. నాకేమి ప్రయోజనం, నాకేమి అవసరం అని ప్రజలు ఆలోచిస్తున్నారు. దీనివల్ల ప్రజల్లో ఆదరణ తగ్గింది. ప్రజలు ఆలోచన శైలి మార్పు కోసం మేము ప్రయత్నిస్తున్నాం. అయితే జాతీయ, రాష్ట్ర స్థాయి పోరాటాల కంటే స్థానిక సమస్యలపై పోరాటాలు ఎక్కువగా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఇలాంటి పోరాటాలతో ప్రజలతో మమేకమైతే ప్రజాదరణ పొందగలం. అందుకే స్థానిక సమస్య పరిష్కారం కోసం ఫోకస్ చేస్తున్నాం.

ఆపరేషన్ కగార్‌పై మీ పార్టీ అభిప్రాయం ఏమిటి?

వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని సీపీఎం డిమాండ్. మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వానికి కోరాం. మావోయిస్టులతో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. వచ్చే ఏడాది మార్చి 31లోగా మావోయిస్టులను నిర్మూలిస్తామని ప్రధాని మంత్రి మోడీ, హెూంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. అయితే ఇది హత్యలను ప్రోత్సహించడమే. ఇది రాజ్యాంగ విరుద్ధం. మావోయిస్టులను నిర్మూలిస్తామనే హక్కు ప్రధాని, హెూం మంత్రికి లేదు. కార్పొరేట్ సంస్థలకు అడవులను అప్పగించేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టారు. ఆదివాసులు అమాయకులు. వారికి అన్యాయం జరిగితే అడిగలేరు. ఆదివాసుల తరుపున అడిగే వారు వామపక్షాలు. అందుకే వారిని హత్య చేసి కార్పొరేట్ సంస్థలకు అడవులను అప్పగించేందుకు ఈ ఆపరేషన్ కగార్ చేపట్టారు.

# భారత్‌కు ఇక అమెరికా అవసరం లేదు.. అమెరికాకే ఇప్పుడు భారత్ కావాలి..



న్యూఢిల్లీ,ప్రధానమంత్రి మోదీ పాలనలో గత 10 సంవత్సరాలలో ప్రపంచ వేదికపై భారతదేశ స్థానం మారిపోయింది.ఒకప్పుడు ఆర్థిక మరియు సైనిక బలం కోసం అమెరికాపై ఆధారపడిన పరిస్థితి ఇప్పుడు తలకిందులైంది.నేడు, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఉద్భవించింది. ఈ మార్పు వెనుక, ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం యొక్క సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు, యువతరం శక్తి మరియు దేశం యొక్క ఆత్మవిశ్వాసం కీలక పాత్ర పోషిస్తున్నాయి.భారత్ మరియు అమెరికా మధ్య ఆర్థిక వ్యత్యాసాలు, ఇప్పుడు భారతదేశానికి అనుకూలంగా మారుతున్నాయి. అమెరికా ఇప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయినప్పటికీ, అదే సమయంలో ప్రపంచంలో అత్యధిక రుణ భారం కలిగిన దేశం కూడా. జాతీయ రుణం మునుపెన్నడూ లేనంతగా పెరిగి, దాని ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది.దీనికి విరుద్ధంగా, భారతదేశం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద మరియు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంది. భారతదేశ వృద్ధి సూచికలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. బలమైన అంతర్గత వినియోగం, ఎలక్ట్రానిక్ వాణిజ్య విప్లవం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి ఈ వృద్ధికి మద్దతు ఇస్తున్నాయి.'ఆత్మనిర్భర్ భారత్' (ఆత్మనిర్భర భారతం) పథకం ద్వారా, ఉత్పత్తి రంగంలో భారతదేశం ఒక విప్లవాన్ని సృష్టిస్తోంది. రక్షణ పరికరాల నుండి స్మార్ట్‌ఫోన్‌ల వరకు, విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ఆర్థిక వ్యవస్థ పునాదిని బలోపేతం చేస్తోంది.

ఇకపై భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి అమెరికాతో సహా ఏ దేశంపై కూడా ఆధారపడాల్సిన అవసరం లేదు. దీనికి విరుద్ధంగా, అమెరికాతో సహా ప్రపంచ దేశాలు తమ ఉత్పత్తులను విక్రయించడానికి, తమ మూలధనాన్ని పెట్టుబడి పెట్టడానికి మరియు ప్రపంచ సరఫరా గొలుసులో చైనాకు ప్రత్యామ్నాయ స్థావరం కోసం భారతదేశాన్నే ఎక్కువగా ఆశిస్తున్నాయి. భారతదేశం యొక్క ఈ ఎదుగుదలకు కారణం, జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్.డి.ఎ.) ప్రభుత్వం గత పదేళ్లలో తీసుకున్న దృఢమైన సంస్కరణలే. ఆ విప్లవాలలో కొన్ని ఇక్కడ ఉన్నాయి:

డిజిటల్ విప్లవం: 'జన్ ధన్ - ఆధార్ - మొబైల్' ద్వారా సృష్టించబడిన డిజిటల్ మౌలిక సదుపాయాలు - ఆర్థిక సమ్మిళితం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేర్చడంలో గొప్ప విజయాన్ని సాధించాయి. ఇది ప్రపంచ దేశాలకే ఒక ఆదర్శంగా ఉంది.

వస్తువులు మరియు సేవల పన్ను: దేశవ్యాప్తంగా ఒకే విధమైన పన్నును తీసుకువచ్చిన జీఎస్టీ, వాణిజ్య భారాన్ని తగ్గించి, ఆర్థిక పారదర్శకతను పెంచింది.

మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడి: ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు మరియు రైల్వే నెట్‌వర్క్‌లో జరుగుతున్న భారీ పెట్టుబడులు, సరఫరా గొలుసు సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయి.

నగదు రహిత ఆర్థిక వ్యవస్థ : యూపీఐ ద్వారా జరిగే రోజువారీ లావాదేవీలు, భారతదేశం నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు వేగంగా పయనిస్తోందని చూపిస్తున్నాయి. ప్రపంచంలోని అత్యుత్తమ ఆవిష్కరణలలో యూపీఐ ఒకటిగా పరిగణించబడుతోంది.ఈ మార్పులు, అవినీతిని బాగా తగ్గించి, పారదర్శక వాణిజ్య వాతావరణాన్ని సృష్టించాయి. దీని ఫలితంగానే, ప్రపంచ సంస్థలు భారతదేశాన్ని ఒక స్థిరమైన మరియు తప్పించుకోలేని మార్కెట్‌గా చూస్తున్నాయి.భారతదేశం యొక్క ఈ ఎదుగుదలకు అత్యంత ముఖ్యమైన చోదక శక్తి, యువతరం యొక్క శక్తి మరియు సామర్థ్యం. నేడు భారతదేశం, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను కలిగి ఉంది. యువత తమ ఉద్యోగాల వేటను దాటి, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించేవారుగా మారారు. విద్య, సాంకేతికత, ఆర్థిక సేవలు వంటి రంగాలలో అనేక 'యూనికార్న్' సంస్థలు ఉద్భవించాయి.ప్రపంచంలోనే అత్యంత యువ మరియు అత్యంత నైపుణ్యం కలిగిన కార్మిక శక్తిని భారతదేశం కలిగి ఉంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో భారతదేశం యొక్క నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ స్థిరంగా ఉంది. విదేశాలలో పనిచేస్తున్న నైపుణ్యం కలిగిన భారతీయులు, 'మాతృభూమికి కీర్తిని తీసుకురావడంతో' పాటు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో మరియు సాంకేతికత మార్పిడిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.ఈ ఉత్సాహభరితమైన మరియు సామర్థ్యం కలిగిన యువ శక్తిని ఉపయోగించుకుని, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ఇకపై ఏ శక్తీ శాశ్వతంగా అడ్డుకోలేదని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు.భారతదేశం, ఇకపై ప్రపంచ వేదికపై ఎవరి దయను ఆశించకుండా, తన ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని నిర్ణయాలు తీసుకునే ఒక కొత్త శక్తి. ఇది కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు, ప్రపంచ వేదికపై భారతదేశం యొక్క రాజకీయ మరియు దౌత్యపరమైన బలాన్ని కూడా ధృవీకరిస్తుంది.

### ఇళ్ల పథకంలో క్రెడిట్ చోరీ స్కీమ్

అమరావతి,ఏపీ సిఎం చంద్రబాబు కథ, స్క్రీన్, ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుందని వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించలేదని, ఒక్క సెంటు స్థలం కూడా ఎవరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇళ్ళ కోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని, ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూపిస్తూ 'ఇళ్లన్నీ మేమే కట్టేశాం' అంటూ పచ్చి

## మా సోదరుడు అమయాకుడు

హైదరాబాద్,దేశంలో పెను విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఏటీఎస్ పోలీసులు ఆదివారం గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేసారు. మొహియుద్దీన్ అరెస్టుపై కుటుంబ సభ్యులు స్పందించారు. మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ ఫారూఖీ మాట్లాడుతూ.. తన సోదరుడు మంచోడని, ఎవరో కావాలనే కుట్రలో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన సోదరుడికి ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు తెలియదని చెప్పాడు. ఒకవేళ తమ సోదరుడు తప్పు చేస్తే కఠినంగా శిక్షించండని ఒమర్ ఫారూఖీ అన్నాడు. చార్మినార్‌లోని రెహమానియా మదర్సాలో మౌలనాగా పనిచేస్తున్న ఒమర్ ఫారూఖీ మాట్లాడుతూ 'మా సోదరుడు మొహియుద్దీన్ ఎవరో ట్రాప్ చేసి ఈ కుట్రలో ఇరికించారు. మా బ్రదర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు మాకు తెలియదు. నవంబర్ 5న బిజినెస్ డీల్ ఉందని చెప్పి ఇంట్లో నుంచి గుజరాత్ బయల్దేరాడు. 9వ తేదీన ఏటీఎస్ వారు నాకు ఫోన్ చేసి మీ సోదరుడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని, అరెస్ట్ చేశాం అని చెప్పారు. మొహియుద్దీన్ నివాసాన్ని ముట్టొద్దు, 2 రోజుల్లో వచ్చి ఆయన రూమ్‌లో ఉన్న సామగ్రి స్వాధీనం చేసుకుంటాం అని ఏటీఎస్ పోలీస్ చెప్పారు. ఇంటికి ఏటీఎస్ పోలీసులు వచ్చారు, సామాన్లు సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏటీఎస్ అరెస్టు చేసినవారిలో మరో ఇద్దరు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహైల్ వారితో మాకు ఎలాంటి లింక్స్ లేవు' అని అన్నాడు. మొహియుద్దీన్ ఆముదం గింజల నుంచి రెసిన్ విషం తయారు చేసినట్లు నిఘా వర్గాల అనుమానించాయి. అందులో వాస్తవం ఏంటో మాకు తెలియదు. ఈ విషాన్ని మంచినీటి వ్యవస్థ, దేవాలయ ప్రసాద నీటిలో కలపాలని కుట్ర జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. పాకిస్తాన్ హ్యాండ్లర్ అబూ ఖదీజా నుంచి టెలిగ్రాంలో ఆదేశాలు అందినట్లు ఏటీఎస్ వారు కనుగొన్నట్లుగా తెలుస్తుంది. మొహియుద్దీన్ ఫోన్లో లొకేషన్ ఆఫ్ చేసి, చాటింగ్ టెలిగ్రామ్ ద్వారా మాత్రమే ఇదంతా చేశాడా అన్నది మాకు తెలియదు. ఇంట్లోనే రెసిన్ తయారీ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు ఏటీఎస్ పోలీస్ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా మొయినుద్దీన్ తిరిగిన మార్గాలపై పోలీస్ ఫోకస్ పెట్టారేమో. కేంద్ర ప్రభుత్వం పూర్తి విచారణ జరపాలన్నాడు. మొహియుద్దీన్ 2007-2013 మధ్య చైనాలో మెడిసిన్ చదివాడు. 2021లో వివాహం అయింది. కొంతకాలం అమెరికాలో ఉద్యోగం చేశాడు. రాజేంద్రనగర్ అసద్ మంజిల్, పోర్ట్‌వ్యూ కాలనీలో నివాసం ఉంటున్నాం. వీరి స్వస్థలం ఖమ్మం. 20 ఏళ్లుగా కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది.

## షాక్ ఇచ్చిన జగన్...

అమరావతి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భయం వెంటాడుతోంది. కేసుల తోపాటు అరెస్టులు జరుగుతుండడంతో దూకుడు కలిగిన నేతలు అజ్ఞాతంలోకి వెళ్ళిపోతున్నారు. కనీసం మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు కూడా భయపడిపోతున్నారు. వైసీపీ హయాంలో రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి.. ఒక ఆట ఆడేసుకున్న నేతలు సైతం ఇప్పుడు కనిపించకుండా పోతున్నారు. అటువంటి వారిలో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఒకరు. వైసీపీ కీలక నేత, ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డి. ఈ ఇద్దరు సోదరులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చాలా యాక్టివ్ గా పని చేసేవారు. అయితే తమను జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా వాడుకున్నారే తప్ప.. తమకు ఎటువంటి ప్రయోజనాలు కల్పించలేదన్న ఆందోళ న, ఆవేదన ఆ ఇద్దరు నేతల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మొన్న ఆ మధ్యన అయోధ్య రామిరెడ్డి పార్టీ మారుతారని కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాత్రం ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అరెస్టుల భయంతోనే ఆయన దూరంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

పార్టీ ఆవిర్భావం నుంచి..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ వస్తున్నారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. అందుకే జగన్మోహన్ రెడ్డి 2014లో పిలిచి మంగళగిరి టిక్కెట్ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచారు కూడా. అయితే మంగళగిరి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేసింది చంద్రబాబు ప్రభుత్వం. కానీ ఆ సమయంలో మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి చాలా దూకుడుగా వ్యవహరించారు. అప్పటి చంద్రబాబుపై కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసేవారు. పెద్ద ఎత్తున కేసులు వేసేవారు. 2019 వరకు అదే దూకుడు కనబరిచారు. 2019లో రెండోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు రామకృష్ణారెడ్డి. జగన్ పిలిచి మంత్రి పదవి ఇస్తారని భావించారు. కానీ జగన్ మాత్రం పట్టించుకోలేదు.

గత ఎన్నికల్లో నో ఛాన్స్..

దాదాపు పది సంవత్సరాలు పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తే.. 2024 ఎన్నికలకు ముందు టిక్కెట్ లేదని తేల్చేశారు జగన్మోహన్ రెడ్డి. మంగళగిరి టిక్కెట్ దక్కకపోయేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు రామకృష్ణారెడ్డి. వెంటనే షర్మిల పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కానీ అక్కడ ఎన్నో రోజులు ఉండలేకపోయారు. తిరిగి జగన్ గూటికి వచ్చేసారు. అయితే ఆ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో ఫుల్ సైలెంట్ అయ్యారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. అయితే చంద్రబాబుతో పాటు టిడిపి నేతలపై కేసుల విషయంలో ముందుండే వారు రామకృష్ణారెడ్డి. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడం, కేంద్రంలో ఎన్డీఏ కీలక భాగస్వామి కావడంతో తన అరెస్ట్ ఉంటుందని అనుమానిస్తున్నారు. అందుకే అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

సత్తెనపల్లి కోసం పట్టు..

మరోవైపు జగన్మోహన్ రెడ్డి సైతం ఆళ్ల రామకృష్ణారెడ్డిని మోసం చేసినట్లు ప్రచారం నడుస్తోంది. మంగళగిరి నుంచి తప్పించిన రామకృష్ణారెడ్డి తనకు సత్తెనపల్లి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే సత్తెనపల్లి టిక్కెట్ విషయంలో మాజీమంత్రి అంబటి రాంబాబుకు హామీ ఇచ్చారు జగన్. ఆ హామీ తప్పితే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని తెలుసు. అందుకే ఆళ్ల రామకృష్ణారెడ్డికి నో చెప్పినట్లు సమాచారం. అందుకే ఇక రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకునేందుకు ఆల రామకృష్ణారెడ్డి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## కాళేశ్వరంపై విచారణ జనవరికి వాయిదా

హైదరాబాద్, కాళేశ్వరం కమిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు మరో 3 వారాలు గడువు ఇచ్చింది. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషికి 3 వారాల గడువు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇకపోతే ఈ వ్యవహారంలో ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించింది. అయితే ఇంతవరకు సిబిఐ రంగంలోకి దిగలేదు. దీనిపై ఇటీవలే సిఎం రేవంత్ రెడ్డి కూడా విమర్శలు సంధించారు.

# పెరుగుతున్న చలి తీవ్రత..సిర్పూర్‌లో అత్యంత కనిష్టంగా 7.1 డిగ్రీలు



హైదరాబాద్/ఆదిలాబాద్, రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలిలో ప్రజలు వణికిపోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గురువారం ఉదయం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠంగా 7.1 డిగ్రీలుగా నమోదయింది. ఇక తిర్యాణిలో 8.2 డిగ్రీలు నమోదయింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ చలి తీవ్రత తగ్గకపోవడంతో స్కూళ్లు, కార్యాలయాలు, రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇక హైదరాబాద్‌లో అతితక్కువగా హెచ్‌సీయూలో 11.8 డిగ్రీలు రికార్డయింది. రాజేంద్రనగర్‌లో 12.9, మారేడుపల్లిలో 13.6 డిగ్రీల రికార్డయింది. ఉదయం 6 గంటల సమయంలో నగర శివార్లలోని ఇబ్రహీంపట్నంలో 11.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, మరో నాలుగు ఐదు రోజుల్లో చలి తీవ్రత మరింత పరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఎన్నడూ లేనట్టుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరికొన్ని రోజులూ ఇదే పరిస్థితి ఉంటుందని, చలి మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత జోన్‌లో ఉందని ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు. రాష్ట్రంలో మరో మూడు నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల నుంచి 12.5 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవచ్చని హెచ్చరించింది. మిగతా అన్ని జిల్లాల్లో 10-12.5 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్ముకుంటోంది. ఈుష్ట్రంలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ ఫ్లూ పెరిగే అవకాశం ఉండటంతో అలర్ట్‌గా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతు తడి ఆరిపోవడం, నొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. గర్భిణులు, ఐదేండ్లలోపు చిన్నారులు, వృద్ధుల్లో సీజనల్ ఫ్లూ లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని దవాఖానలను సందర్శించాలని కోరారు. అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే తక్షణమే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు.

# హైదరాబాద్‌లో హై అలర్ట్...



హైదరాబాద్, భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోటల్స్‌పై పోలీసులు నిఘా పెంచారు. ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా.. అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈుగా... రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

# అడవి మధ్యలో పెద్దిరెడ్డికి పట్టా.. ఇదెట్టా!



అమరావతి, వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అక్రమాలపై ఏపీలోని కూటమి ప్రభుత్వం కూపీ లాగుతోంది. ముఖ్యంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని సాగించిన అరాచకాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో ఇటీవలే చిత్తూరు జిల్లాలోని అడవి ప్రాంతంలో పర్యటించారు. ఎర్రచందనం డిపోలను తనిఖీ చేశారు. అడవిలో భూములను పరిశీలించారు. ఇదే సమయంలో చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలోని అటవీ భూముల వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కఠిన వైఖరి ప్రదర్శించారు. అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్న 104 ఎకరాల భూములపై ఉన్నతాధికారులతో బుధవారం(నవంబర్ 12న)టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భూమి ఎలా వారసత్వంగా మారిందన్నది, ఏ దశలో ఎవరి పాత్ర ఎంతుందన్న అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.

సర్వే నంబర్లలో తేడాలు..

మంగళంపేట గ్రామంలోని సర్వే నంబర్లు 295, 296లలో అటవీ భూముల విస్తీర్ణంపై స్పష్టత అవసరమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రికార్డుల్లో విస్తీర్ణం మారుతున్నట్లు కనబడటం, సబ్ డివిజన్ ప్రక్రియ ద్వారా భూమి సంఖ్యలు పెరిగినట్లు ఆధారాలు వెల్లడిస్తున్నాయని పరిశీలనలో తేలిందని చెప్పారు. రక్షిత అటవీ ప్రాంతాల్లో ఎస్టేట్లు నిర్మించిన వారిని ఎవరయినా విడిచిపెట్టొద్దని ఉప ముఖ్యమంత్రి హెచ్చరించారు. భూములు ఆక్రమించిన వ్యక్తుల వివరాలను అటవీశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని, వారి మీద ఉన్న కేసుల ప్రగతిని ప్రజలకు వెల్లడించాలని ఆదేశించారు.

ఎన్నికల అఫిడవిట్లలో వ్యత్యాసాలపై ఫోకస్..

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి 2024 ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్లలో పేర్కొన్న అటవీ భూముల విస్తీర్ణానికి వ్యతిరేకంగా కొత్త వివరాలు వెలుగులోకి వస్తున్నాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం 40.80 ఎకరాలు చూపిస్తే, వెబ్‌ల్యాండ్లో 77.54 ఎకరాలు నమోదు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. ఈ వ్యత్యాసం ఎలా వచ్చిందో తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ విభాగం ఇప్పటికే మంగళంపేట భూములపై పూర్తిస్థాయి సమాచారం సమర్పించిందని, ఆ నివేదికే భవిష్యత్తు చర్యలకు పునాదిగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అటవీశాఖ అధికారులు విషయాన్ని పారదర్శకంగా పరిశీలించి ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలని సూచించారు.

# విశాఖలో ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన



విశాఖపట్నం, విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మంత్రితో పాటు సెయిల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో, ఎండీ కిరణ్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ హరి బైర్రెడ్డి, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా 430మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎండీ కిరణ్ వెల్లడించారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్‌పై సెయిల్స్ సాఫ్ట్ వేర్ సంస్థ దృష్టిసారించనుంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. విశాఖ యూనిట్‌పై రెండుదశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టి.. 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హరి బైర్రెడ్డి వెల్లడించారు. అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్‌మె, ఏఐ రీసెర్చి, కస్టమర్ డెలివరీ ఎక్సలెన్స్‌పై ఫినోమ్ దృష్టి సారించనుంది. 3 దశల్లో రూ.119.18 కోట్లు పెట్టుబడి పెట్టి, 2వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటీఓ సేవల డెలివరీ కార్యకలాపాలను ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ చేపట్టనుంది.

# వామ్మో.. వైస్ ఛాన్సలర్‌ది కూడా చీకటి బాగోతమే.. హిస్టరీ తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే..!




న్యూఢిల్లీ,చెట్టు మంచిదైతే దాని కాయ కూడా మంచిదని ఎంచాలని పెద్దలు అంటుంటారు. అసలు చెట్టే మంచిది కాదన్నప్పుడు కాయ ఎలా మంచిది అవుతుంది. కానే కాదు. ఇదంతా ఇప్పుడెందుకు అంటారా?ప్రస్తుతం ఢిల్లీ కారు బాంబ్ పేలుడు తర్వాత ప్రముఖంగా వినిపిస్తున్న పేరు "అల్-ఫలాహ్ యూనివర్సిటీ' పేరు. విశ్వవిద్యాలయం అంటే విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టేది. కానీ అల్-ఫలాహ్ యూనివర్సిటీ మాత్రం అందుకు పూర్తి భిన్నం. ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగానే డాక్టర్ల బృందం దేశ వ్యాప్త దాడులకు ప్రణాళికలు రచించారు. దీనికి ప్రధాన కారణం.. పునాది స్థాపకుడే ఒక పెద్ద విషవృక్షం. చెట్టే మంచిది కానప్పుడు కాయలు ఎలా మంచివి అవుతాయి. ఇక అసలు విషయంలోకి వెళ్లిపోతే

జావాద్ అహ్మద్ సిద్ధిఖీ..

జావాద్ అహ్మద్ సిద్ధిఖీ (61).. ఇతడే అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయ స్థాపకుడు. హర్యానాలోని ఫరీదాబాద్‌లోనే ఈ యూనివర్సిటీ ఉంది. "అల్-ఫలాహ్" అంటే అరబిక్‌లో విజయం, శ్రేయస్సు అని అర్థం. ఇక జావాద్ నవంబర్ 15, 1964లో జన్మించాడు. హమ్మద్ అహ్మద్ సిద్ధిఖీకి పుట్టిన ముగ్గురు కుమారుల్లో జావాద్ ఒకడు. మధ్యప్రదేశ్‌లోని మోవ్‌లో పెరిగాడు. ఇది భీమ్‌రావ్ అంబేద్కర్ జన్మస్థలం. ప్రస్తుతం ఈ పట్టణం పేరు కూడా మార్చబడింది. ఇక జావాద్ ఇండోర్‌లోని దేవి అహల్యా విశ్వవిద్యాలయం నుంచి ఇండస్ట్రియల్, ప్రొడక్ట్ డిజైన్‌లో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం జావాద్ కుటుంబం ఢిల్లీకి మకాం మారింది. ఇక 1993లో జామియా మిలియా ఇస్లామియాలో మెకానికల్ ఇంజనీరింగ్ లెక్చరర్‌గా జావాద్ పని చేయడం ప్రారంభించాడు. ఇక్కడే అతగాడి కలలు పెరిగాయి. తన ఆశయాలను విస్తరించేందుకు ప్రణాళికలు రచించాడు. జావాద్ లెక్చరర్‌గా పని చేస్తుండగా అల్-ఫలాహ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌ను ప్రారంభించాడు. కొద్దికాలంలోనే సంస్థ బహుగా పురోగతి సాధించింది. ఆయా ప్రాంతాల్లో దజను వెంచర్లు విస్తరించాయి. దీనికి జావాదే డైరెక్టర్, ఛానలర్‌గా కొనసాగుతున్నాడు. ఈ యూనివర్సిటీలో చదివే విద్యార్థులంతా జావాద్‌నే రోల్‌మోడల్‌గా తీసుకుంటారు. అంతగా పాపులరిటీని సాధించాడు. ఇక జావాద్.. జామియా నగర్‌లో ఒక విలాసవంతమైన భవనం నిర్మించుకున్నాడు. అల్-ఫలా హౌస్‌గా పిలవబడే ఈ ఇంట్లోనే ప్రతి ఏడాది చాలా గ్రాండ్‌గా పుట్టినరోజు వేడుకలు కూడా జరుపుకుంటాడు. ఈ ఏడాది కూడా చాలా గ్రాండ్‌గా వేడుకలు జరుపుకునేందుకు ప్లాన్ వేసుకున్నాడు. కానీ ఇంతలోనే ఢిల్లీ బాంబ్ పేలుడుతో యూనివర్సిటీ భండారం బయటపడింది. ఇక జామియా నగరం కేంద్రంగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని జావాద్ విస్తరించాడు. తన సోదరుడైన సౌద్‌తో కలిసి కొన్ని చిన్న కంపెనీలను కూడా స్థాపించాడు. ఇందులో ప్రధానంగా అల్-ఫలాహ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఒకటి ఉంది. అయితే ఇందులో పెట్టుబడులు పెడితే అధిక రాబడి వస్తుందంటూ జావాద్ నమ్మ బలికాడు. దీంతో చాలా మంది పెట్టుబడులు కూడా పెట్టారు. అంతే ఇదే అదునుగా భారీ మోసానికి పాల్పడ్డాడు. ఒక్కసారిగా పెట్టుబడులన్నింటినీ అపహరించాడు. దీంతో 2000లో ఢిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీలో కేఆర్ సింగ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు (నం.43/2000) ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఈ కేసును ఢిల్లీలోని క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసి జావాద్‌ను అరెస్ట్ చేసింది. సోదరుడు సౌద్‌తో కలిసి మూడేళ్లు జావాద్ జైల్లో ఉన్నాడు. 2023 మార్చిలో బెయిల్‌కు అప్లై చేసుకుంటే తిరస్కరణకు గురైంది. పెట్టుబడులను వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకున్నారని ఢిల్లీలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ తేల్చింది. చివరికి 2004లో బెయిల్ లభించింది. ఇక అంతలోనే 2005లో పాటియాలా కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. పెట్టుబడిదారులకు తిరిగి డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిర్దోషిగా విడుదల చేసింది. ఇక ఫరీదాబాద్‌లో స్థాపించిన కళాశాలను.. అనంతరం అల్-ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌గా 2019లో తరగతులు ప్రారంభం అయ్యాయి. చౌకగా వైద్య విద్యను అందించడంతో చాలా మంది విద్యార్థులు మెడికల్ విద్యను అభ్యసించారు. మైనారిటీ విశ్వవిద్యాలయంగా పేరుగాంచింది. ఇక ఇందులో చదివిన కొంత మంది హిందు విద్యార్థులు కూడా ముస్లింలుగా మారారని.. హిజాబ్‌లు, బురా?లు ధరించడం వంటివి జరిగినట్లుగా తెలుస్తోంది. ఇక కోవిడ్ సమయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. కరోనా సమయంలో నర్సులు జీవిత బీమా డిమాండ్ చేసినందుకు వెంటనే వారిని తొలగించేశారని ఆరోపణలు ఉన్నాయి. స్టైపెండ్‌లు చెల్లించకపోవడాన్ని నిరసించినందుకు మెడికల్ ఇంటర్న్‌లను కూడా సస్పెండ్ చేసేశారు. యూనివర్సిటీ కేంద్రంగా అనేక దుర్మార్గాలు జరిగినట్లుగా అందులో పని చేసిన ఒక మాజీ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో ఈ భండారం వెలుగులోకి వచ్చింది. అయితే ఢిల్లీ బ్లాస్ట్ తర్వాత అల్-ఫలాహ్ యూనివర్సిటీ దుర్మార్గాలు అనేకమైనవి వెలుగులోకి వచ్చాయి. ఈ యూనివర్సిటీ కేంద్రంగా దేశ వ్యాప్తంగా వైద్యులు మారణహోమం సృష్టించాలని ప్రణాళికలు రచించినట్లుగా దర్యాప్తు సంస్థలు కనిపెట్టాయి. దర్యాప్తు సంస్థలు ముందుగానే అప్రమత్తం అవ్వడంతో ఈ కుట్ర కోణం బయటపడింది. లేదంటే దేశంలో మరిన్ని దాడులు జరిగుండేవి. ఎంతో మంది ప్రాణాలు పోయేవి. ఇంత పెద్ద కుట్రను ఛేదించిన దర్యాప్తు సంస్థలకు కచ్చితంగా సెల్యూట్ కొట్టాల్సిందే.

# దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కన్నీరు



న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా ఉల్లి పంట పండించిన అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు, కొనడానికి అధికధరలు వెచ్చించి ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఏపిలో కర్నూలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం హడావిడి చేసినా రైతులకు ఒరిగిందేమీ లేదు. చాలా చోట్ల రైతులు ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లితే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని, పొలాల్లోనే వాటిని వదిలేస్తున్నారు. కొన్ని మాసాల నుంచే అక్కడి రైతులు మద్దతు ధర కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనేవుంది. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో కిలో ఉల్లి మాత్రం 30కి పైనే అమ్ముతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఇప్పటికే పాత ఉల్లి పంట నిల్వలు ఉండగా..ఇప్పుడు కొత్త పంట కూడా మార్కెట్‌లోకి రావడం, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలకు ఎగుమతులు నిలిపివేయడం వంటి కారణాల మూలాన ధరలు అమాంతం పడిపోయాయి. మంగళవారం కిలో రూ.2కు పడిపోయిన ధరలు బుధవారం రూ.1 కంటే దిగువకు పడిపోయాయి. కనీసం రవాణా ఛార్జీలు కూడా దక్కకపోవడంతో రైతు మార్కెట్‌లోనే కంటతడి పెడుతున్నారు. ఉల్లి ప్రధాన మార్కెట్లలో ఒక్కటైన మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో మంగళవారం కిలో ఉల్లి ధర రూ.2గా ఉంది. బుధవారం మరో ప్రధానమార్కెట్ అయిన మంద్‌సౌర్‌లో కిలో ఉల్లి ధర రూ.1కి, అంతకంటే దిగువకు పడిపోయింది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. మాల్వాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక రాజస్థాన్‌లోని అల్వార్‌లోనూ ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడ కూడా కిలో ఉల్లి రూ.1 నుంచి రూ.5 మధ్యనే పలుకుతోంది. నాణ్యత మరీ అధికంగా ఉంటే కిలో రూ.8 చొప్పున కొంటున్నారు. ఇక ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి పాయల మార్కెట్‌గా పేరొందిన మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలోనూ ఉల్లి రైతు గోడు అంతాఇంత కాదు.÷రిత్త, పాత ఉల్లిపాయల నిల్వలు ఒకేసారి మార్కెట్‌లోకి వచ్చిన నేపథ్యంలోనే ఉల్లి పాయల ధరలు పడిపోయినట్లు ప్రకటించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని బిజెపి నేతృత్వ డబుల్ ఇంజిన్ సర్కార్లు చేతులు దులిపేసుకుంటున్నాయి. అన్నదాతలకు కనీస మద్దతు కూడా ఇవ్వకుండా పరిహాసమాడు తున్నాయి. ప్రభుత్వం తక్షణమే ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి..ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసినా..డబుల్ ఇంజిన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరి స్తోంది. దాదాపు ఆరు నెలలుగా తమ ఉత్పత్తులను నిల్వ చేసినప్పటికీ.. సరైన ధర లభించడం లేదని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వెల్లుల్లి ధరలు కూడా భారీ స్థాయిలో పడిపోవడంతో అక్కడి రైతన్నలు ఆక్రందనకు గురౌతున్నారు. వాతావరణ పరిస్థితులు, నిల్వ చేయడానికి అవసరమైన గోడౌన్లు లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి ఉల్లి పంట సాగు చేసే రైతన్నలను సంక్షోభంలోకి నెట్టేశాయని మహారాష్ట్ర స్టేట్ ఆనియన్ ప్రొడ్యూసర్స్ ఫార్మర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్ డిఘోలే అన్నారు. సంక్షోభ నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రత్లాం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర కేవలం రూ.600గా ఉంది. పొలం నుంచి మార్కెట్‌కు ఉల్లిని తరలించడానికి రవాణాకు అయిన ఖర్చు కూడా రావడం లేదని నగ్రా గ్రామానికి చెందిన ఓ అన్నదాత వాపోయాడు. '30 క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌కు తరలించేందుకు రూ.2 వేలు అయ్యింది. మార్కెట్‌లో అమ్మగా క్వింటాల్‌కు రూ.250లే వచ్చాయి. తీవ్రంగా నష్టపోయాం' అని దుంఖం నిండిన కళ్లతో ఆ రైతు అన్నారు.

# మరోసారి భారత్ పాక్ ల మధ్య ఉద్రిక్త వాతావరణం



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనతో భారత్-పాకిస్థాన్ సంబంధాలు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి, "ఆపరేషన్ సింధూర్" ఘటనలతో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ఇంకా చల్లారకముందే ఈ సంఘటన చోటుచేసుకుంది. సోషల్ మీడియాలో "ఆపరేషన్ సింధూర్ 2.0" హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతుండగా, దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. తాజా కేబినెట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఈ పేలుడును ఉగ్రవాద చర్యగా పేర్కొంది. ఈ ఘటన వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. విచారణను వేగవంతంగా చేపట్టాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉండగానే ఈ ఘటనపై స్పందించారు. దేశ భద్రతకు ముప్పుగా నిలిచే శక్తులపై కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో కూడా నెటిజన్లు పాకిస్థాన్‌పై కఠిన వైఖరి అవలంబించాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు

ఇక పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్, అఫ్గానిస్తాన్‌లతో యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో జరిగిన సూసైడ్ బ్లాస్ట్‌లో 12 మంది మృతి చెందగా, ఆ దాడికి పాక్ తాలిబాన్ బాధ్యత వహించిన విషయం తెలిసిందే. ఆ దాడికి భారత్ మద్దతుగా ఉందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలతో పరిస్థితులు మరింత వేడెక్కాయి. గతంలో "ఆపరేషన్ సింధూర్" సమయంలో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. కానీ ఈసారి పాకిస్థాన్‌కు అమెరికా మద్దతు దొరకదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమెరికా ప్రస్తుతం ఆర్థిక, రాజకీయ సమస్యల్లో చిక్కుకుపోయినందున దక్షిణాసియా ఉద్రిక్తతలపై దృష్టి సారించే అవకాశం తక్కువగా ఉందని అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com